ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు


3

మంగళవారం 21 మే 2024



కట్టలకు ఎక్కడపడితే అక్కడ గండ్లు.. కాల్వల లోపల పూడికలు.. షట్టర్‌లు దెబ్బతినిపోయి, తూములు పూడిపోయి, చుక్కనీరు చివరి వరకు వెళ్లాలంటే కష్టకాలమే. ప్రభుత్వం ఇస్తున్న చిల్లర విదిలింపులకు ఒక్క గండీ పూడ్చ లేని పరిస్థితి. కాల్వ కట్టలు దెబ్బతినిపోయినా, గండ్లు పడినా, చివరి భూములకు నీరు అందకపోయినా అడిగే దిక్కేలేదు. పనులకోసం నీటిపారుదల శాఖ కు మరమ్మతుల కోసం ఒక్క రూపాయి నిధులు ఇచ్చిన పాపాన పోలేదు. ఓ అండ్ ఎం నిధులే దిక్కు అవికూడా ప్రతిపాదనలు పంపినంత కాదు... వారికి తోచినంత, చేతికి వచ్చినంత... అన్న చందంగానే జరుగుతూ వచ్చింది.

- ఖరీఫ్ వచ్చేసింది... కాల్వల పనులేవీ!
- 2024-25 ఖరీఫ్ సీజన్‌కు నీటిపారుదల శాఖ సన్నద్ధత ఏదీ!
- ఐదేళ్లుగా రైతుల కష్టాలు వర్ణనాతీతం
- కాల్వల పనులు చేయడానికి ఓ అండ్ ఎం నిధులే దిక్కు
- వాటిలోనూ 80 శాతం పైగా నేతల జేబుల్లోకే..



కాల్వల గోడలు, తూములు వాలిపోయిన దృశ్యం



ప్రభుత్వం పనులు చేయకపోవటంతో సాగునీటి సంఘాల స్ఫూర్తితో రైతులే ఎక్స్‌కవేటర్‌తో కాల్వల పూడిక తీయించుకుంటున్న దృశ్యం

కాల్వేలు.. కడగండ్లు

మళ్లీ 2024-25 ఖరీఫ్ సీజన్ రానే వచ్చింది. కాల్వలన్నీ పనుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. కానీ నిధుల మంజూరు ఊసేలేదు. ఎన్నికలు జరిగినా, పాలన విషయంలో ఆలస్యం కావటం కానీ, పట్టించుకోకుండా వదిలేయటం కానీ చేస్తే, ఒక సీజన్ పంట దిగుబడులపై ప్రభావం చూపే పరిస్థితి. అదే జరిగితే తిండిగింజలకూ కటకటలాడాల్సిందే. ఇవేమీ ఇప్పటి ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవటంలేదు. కాలానుగుణంగా జరగాల్సిన పనులపై దృష్టిపెట్టిన పరిస్థితి లేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో వరి రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. ఈ ఏడాదయినా సాగునీరు సక్రమంగా అందుతుందన్న నమ్మకం లేకుండా పోతోంది.

తెనాలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి కాల్వపై రైతుల భాగస్వామ్యంతో ఒక సంఘం... ఆ కాల్వపై ఎక్కడ ఏమేం పనులు చెయ్యాలి? వాటిలో అత్యవసరమేంటనేది నిర్ణయించేది కూడా వాళ్లే. ఇక్కడ రాజకీయాలతో పనిలేదు. కేవలం రైతుల తీర్మానాలే ప్రభుత్వానికి శిరోధార్యం. నిధులు మంజూరు చేయ టం, దగ్గరుండి రైతులే ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయించుకోవటం వంటి మాటలు వింటుంటే ఎంత బాగుంది! ఇప్పుడు కాల్వలున్న దుస్థితిలో, వాటి ద్వారా సాగునీరు రాక, పంటలు కళ్లెదుటే ఎండిపోతుంటే రైతులు పడ్డ అవస్థల తరుణంలో ఈ మాటలు కళ్లెదుట కనిపిస్తుంటే నిజంగా సంతోషమే రైతుల ముఖంలో కనిపిస్తుంది. అయితే ఇవన్నీ ఒకప్పుడు రైతులు చూసినవే, స్వయంగా దగ్గరుండి పనులు చేయించుకున్నవే. కానీ ఈ ఐదేళ్లలో రైతుల కష్టాలు పట్టించుకునే నాథుడు లేడు. సాగునీటి సంఘాలుంటే వారి దోపిడీకి అడ్డుగా ఉంటుందనుకున్నారో! లేక నిధులు ఇవ్వలేని పరిస్థితుల్లో రైతులు నిలదీస్తారనుకున్నారో కానీ, జగన్ సర్కారు రైతుల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సాగునీటి సంఘాలకు నిర్ధాక్షిణ్యంగా తీసేసింది. వాటి స్థానంలో వైసీపీ నాయకులే కాల్వల పనులుచేసే కాంట్రాక్టర్‌లయ్యారు. కాల్వల పనుల కోసం విదిలించే నాలుగు మెతుకులూ వారే తన్నుకుపోతే, చివరకు రైతులకు సాగునీటి కష్టాలు, కడగండ్లే మిగిలాయి. ఇప్పటికి ఐదు ఖరీఫ్, రబీ సీజన్‌ల నుంచి వీరి కష్టాలకు పరిష్కారమే లేకుండా పోయింది. ఒక్క ఎకరా ఎండినా ఊరుకునేది లేదని గెలిచిన మొదటి సంవత్సరం గొప్పగా హెచ్చరించిన ముఖ్యమంత్రి తర్వాత అసలు రైతుల కష్టాలనే పక్కనపెట్టి, వారికి రైతు భరోసా కేంద్రాలు, ఇతర కొత్త వసతుల కల్పన పేరుతో కొత్త కష్టాలను సృష్టించారు. అవికూడా వారికి దోపిడీ కేంద్రాలుగానే మిగిలిపోయాయి. దీంతో రైతుల కష్టాలకు అంతే లేకుండాపోయింది.

పనులు చేయకుండానే నిధులు మింగేసి!

ఖరీఫ్ సీజన్ వస్తుందంటే మూడు నెలల ముందు నుంచి కాల్వల మరమ్మతులు, అత్యవసర రిపేర్‌లను పూర్తి చేసే పనిలో నీటిపారుదల శాఖ తలమునకలై ఉండేది. కానీ గత ఐదు సీజన్‌లుగా ఒక్కపనికూడా లేదు. దీనికి కారణం... నిధుల లేమి. ప్రభుత్వం రైతులకోసం కేటాయిస్తానన్న నిధుల మూటలు అటుంచితే, అత్యవసర పనులు చెయ్యాల్సిన తరుణంలోనూ మొండిచెయ్యే చూపుతూ వచ్చింది. గతంలో సాగునీటి కాల్వల మరమ్మతులకోసం సాధారణ నిధులు, ప్రత్యేక మరమ్మతుల కోసం నిధులను ప్రభుత్వ విడుదల చేసేది. ఇవేకాక ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్(ఓ అండ్ ఎం) కింద కూడా కొన్ని నిధులు మంజూరు చేసేవారు. అయితే వైసీపీ సర్కారు వచ్చాక అవన్నీపోయి చివరకు ఓ అండ్ ఎం నిధులే దిక్కయ్యాయి. అవికూడా నీటిపారుదల శాఖ రూ.100 కోట్ల వరకు ప్రతిపాదనలు పంపితే, వాటిలో రూ.15 కోట్ల నుంచి రూ.20 కోట్ల లోపే నిధులు మంజూరు చేశామనిపించేవారు. ఆ నిధులను కూడా కాల్వలు ఖాళీగా ఉన్న ప్పుడు కాకుండా, కాల్వలకు నీరు వదిలే సమయంలో విడుదల చేసి, హడావిడి చేసినట్టు చూపించి చివరకు వాటిలో 80 శాతం నిధులు ఆ పార్టీ నేతలే కాంట్రాక్టర్‌లుగా అవతారమెత్తి దోచేసిన సందర్భాలున్నాయి. వీటిపై రైతులు ప్రశ్నించినా, ఎవరికైనా ఫిర్యాదు చేసినా వారిపై దౌర్జన్యాలు చేసిన సంఘటనలూ లేకపోలేదు. గత ఖరీఫ్ సీజన్‌కు ముందు రూ.22కోట్లు ప్రభుత్వం ఓ అండ్ ఎం కింద మంజూరు చేస్తే, వాటిలో తూటుకాడ తొలగింపు, పూడికతీత పేరుతో మొత్తం అవచేశారు. అయితే ఒక్క కాల్వలోనూ తూటుకాడ నిర్మూలనకు మందులు పిచికారి చేసింది లేదు. ఇక పూడిక తీతంటారా! నీరు వదిలాక లోపల ఏముందనేది కనిపించేది కాదుకదా! ఏం చెప్పినా, ఎంత దోచేసినా అడిగే దిక్కే లేకపోవటంతో నిధులన్నీవారి జేబుల్లోకి, రైతుల కష్టాలు మాత్రం కన్నీటి రూపంలో పంటలను కాపాడుకునేందుకు ఏరులయ్యే పరిస్థితి. గత మూడు ఖరీఫ్ సీజన్‌లనుంచి అయితే మరీ దారుణంగా కాల్వల చివరి భూములకు నీరు అందక వేల ఎకరాలు బీళ్లుగా వదిలేసిన పరిస్థితి.

నీటి సంఘాలుంటే ప్రతి కాల్వపైనా అజమాయిషీ

గతంలో సాగునీటి సంఘాలున్నప్పుడు చాలావరకు సాగునీటి కష్టాలు తొలగిపోయాయి. అత్యవసర, సాధారణ మరమ్మతులను విభజించి, వచ్చిన నిధులతో కాల్వల పనులను రైతులే చేసుకోవటంతో వారి కష్టాలకు వారే పరిష్కారం చూసుకునేవారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు చంద్రబాబు సాగునీటి సంఘాల కొత్త విధానాన్ని తీసుకొచ్చారు. రైతులే నాయకులుగా, రైతులే ఓటర్లుగా మంచి వ్యక్తిని ఎన్నుకుని, వారి ద్వారానే పనులు చేయించుకునే విధంగా కొత్త విధానానికి అప్పట్లో శ్రీకారం చుట్టారు. దీనివల్ల రైతుల కష్టాలకు చాలావరకు ముగింపు దొరికినట్టయింది. కృష్ణా పశ్చిమ డెల్టాలో 5.73 లక్షల ఎకరాలు సాగవుతుంటే, ఇదంతా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉంది. వీటికి కొమ్మమూరు, పశ్చిమ బ్యాంక్ కెనాల్, తూర్పు, పశ్చిమ కాల్వలు, నిజాంపట్నం కాల్వల ద్వారా, వాటి పంట కాల్వల ద్వారా నీరందుతుంది. అయితే ప్రధాన కాల్వలే కాకుండా ప్రతి పంట కాల్వపైనా సాగునీటి సంఘాలకు అజమాయిషీ ఉండేది. ప్రతి అడుగు వదలకుండా రైతులు కాల్వలపై ఇబ్బందులను చెప్పేవారు కనుక మరమ్మతులు చేయటం కూడా తేలికయ్యేది. రైతులే పనులు చేయించుకుంటారు కనుక నిధుల దుర్వినియోగం విషయం అటుంచితే, ప్రతి రూపాయి సద్వినియోగం అయ్యేది. ఒకవేళ సంఘంలో ఎవరైనా దుర్వినియోగం చేసేందుకు కానీ, జేబులో వేసుకునేందుకు కానీ ప్రయత్నం చేస్తే మిగిలిన రైతులు నిలదీస్తారని ఎవరూ సాహసించేవారు కాదు. దీంతో కాల్వల కష్టాలు తీరటంతోపాటు ప్రతి ఎకరాకూ నీరందేది.



టీడీపీ ప్రభుత్వ కాలంలో ప్రతి కాల్వపైనా రైతులకోసం ఏర్పాటుచేసిన బోర్డ్

డెల్టా ఆధునికీకరణ..

డెల్టా కాల్వల ఆధునికీకరణ సమయంలో కొమ్మమూరు కాల్వపై రూ.400 కోట్ల విలువైన పనులు జరగనేలేదు. ఆ నిధులు అప్పట్లో మురిగిపోయాయి. అయితే తర్వాత కాల్వ కట్టలు ఛిద్రమైపోయి గండ్లు పడటం, పంటలు దెబ్బతినటం షరామామూలయింది. బాపట్ల ప్రాం తంలో భారీ గండిపడినప్పుడు ప్రభుత్వం నిధులు సరిపడా ఇవ్వలేకపోవటం, పనులు సరిగా జరగక ఏటా ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి. అయితే సాగునటి సంఘాలు ఈ తరుణంలో ఉంటే, రైతులే దగ్గరుండి పనులు చేయించుకుంటారు కనుక కష్టాలకు చాలా వరకు చరమగీతం పాడేవారు. ఈ ప్రభుత్వ కాలంలో పనులు చేసేవారంతా రైతువారీ కాకపోవటంతో అంతా లాభాపేక్షతో దోచుకునేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో రైతుల కష్టాలు మాత్రం ఈ ఖరీఫ్‌కు కూడా తీరని పరిస్థితి. మరో నెలలో 2024-25 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్ మొదలవుతుంటే, ఇంతవరకు కాల్వల విషయం పట్టించుకున్న నాధుడులేడు. చాలా కాల్వలపై అత్యవసర మరమ్మతులు ఎన్నో ప్రభు త్వం విడుదలచేసే నిధుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నాయి. ఎన్నికలతో సంబంధం లేకుండా ముందస్తుగా తీసుకోవలసిన నిర్ణయమైనా నీటిపారుదల శాఖ కూడా మమ్మల్ని కదిపేవారులేరు. మాకు ఏ ఇబ్బంది లేదన్నట్టు రైతుల కష్టాలను వారివే వదిలేసి చోద్యం చూస్తున్నారు. రేపటి రోజున ప్ర భుత్వ మారితే మళ్లీ సాగునీటి సంఘాలు వస్తే మా కష్టాలు తీరతాయనేది రైతుల ఆశా భావం. అయితే ఇప్పుడు 2024-25 ఖరీఫ్ సీజన్ వచ్చేయటంతో నీటి సంఘాలు కాకపోయినా, కనీసం అధికారులయినా పనులు చేయించేందుకు ముందస్తు మేలుకొలుపు అవసరమే. గతేడాదిలా కాల్వలకు నీరొదిలే సమయంలో కాకుండా ముందుగా నిధులు అందితేనే పనులు కాస్తయినా జరిగేది. ఈ సీజన్‌కు కనీసం ఓ అండ్ ఎం నిధులయినా మంజూరు చేస్తేనే కాల్వల్లో నీరు పారేది. లేకుంటే సాగునీటి కష్టాలు ఏటా ఉన్నవాటికంటే మరింత జటిలమైనట్టే. మరి అధికారులు దీనిపై వెంటనే దృష్టిపెడతారో! లేదో?



కెనాల్‌పై పనులు చేసే వారు లేక అధ్వానంగా కట్టలు

బాపట్లదే.. తొలి ఫలితం

- అద్దంకిలో అత్యధికంగా 21 రౌండ్లు
- జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 1510 పోలింగ్ స్టేషన్లు
- అత్యధికంగా అద్దంకిలో 298 కేంద్రాలు..
- అత్యల్పంగా బాపట్లలో 202
- ఏర్పాట్లపై దృష్టి పెట్టిన అధికారులు



బాపట్ల, మే20(ఆంధ్రజ్యోతి): కౌంటింగ్‌కు సంబం ధించి ఏర్పాట్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా వేగవంతం చేశారు. దీనిలో భాగంగా కౌంటింగ్‌ను పోలింగ్ స్టేషన్ల వారీగా రౌండ్‌కు 14 చొప్పున లెక్కిస్తారు. ఒక్కో టేబుల్‌కు ఇదేవిధంగా ఏర్పాట్లు చేస్తారు. జిల్లాలో 1510 పోలింగ్ స్టేషన్లు ఉండగా అత్యధికంగా అద్దంకిలో 298 ఉన్నాయి. తర్వాత స్థానాల్లో పర్చూరు 295, రేపల్లె 264, వేమూ రు 233, చీరాల 218, బాపట్లలో 202 పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ పరిధిలోని సంత నూతలపాడు నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కూడా బాపట్ల ఇంజ నీరింగ్ కళాశాలలోనే జరగనుంది. కౌంటింగ్ ప్రక్రియ రోజు స్ట్రాంగ్ రూంలకు అనుసంధానంగా కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రక్రియలో యం త్రాంగం నిమగ్నమై ఉంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే సిబ్బందికి శిక్షణ పూర్తిచేసిన అధికారులు నియోజకవర్గాల వారీగా కేటాయింపు కార్యక్రమం మీద దృష్టిపెట్టారు. ఫలితాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో భాగంగా ఈసీ నుంచి కూడా సంబంధిత సాఫ్ట్‌వేర్ రానుందనేది సమాచారం. ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి ఓట్లలెక్కింపులో భాగం గా 250 మంది సిబ్బంది సేవలను వాడు కోనున్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగా చూస్తే తొలి ఫలితం బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గానిదే అవనుంది. ఇక్కడ అతి తక్కువగా 202 పోలింగ్ స్టేషన్లు మాత్రమే ఉండగా 14 రౌండ్లలోనే లెక్కింపు పూర్తి కానుంది. మలి ఫలి తం చీరాలది కానుంది. ఇక్కడ 218 కేంద్రాలు ఉండగా 16 రౌండ్లలో ఫలితం తేలనుంది. వేమూరులో 233 పో లింగ్ స్టేషన్లకుగాను 17 రౌండ్లు పూర్త య్యాక విజేత ఎవరో తేలనునన్నారు. రేపల్లెలో 264 కేంద్రాల్లో పోలింగ్ జరగ్గా 19 రౌండ్లలో ఓట్లు లెక్కించి ఫలితం వెల్లడించనున్నారు. పర్చూరులో 295, అద్దంకిలో 298 కేంద్రాలలో ఓటింగ్ జరగ్గా ఈ రెండు చోట్ల 21 రౌండ్లలో లెక్కింపు జరగనుంది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో తుది ఫలితం ఈ రెండు చోట్ల వెల్లడి కానుంది.

దారి.. అధ్వానం

- తీరంలో రహదారులు గుంతలమయం
- నిత్యం ప్రమాదాలు
- దృష్టి సారించని అధికారులు



సింగుపాలెం అడ్డరోడ్డు సమీపంలో అధ్వానంగా ప్రధాన రహదారి

రేపల్లె, మే 20: తీర ప్రాంతంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా తయారై ప్రమాదాలకు నిలయాలుగా ఉన్నాయి. రేపల్లె నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో ప్రధాన రహదారులపై భారీగా గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిలిచి నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రేపల్లె నుంచి గంగడిపాలెం వెళ్ళే ప్రధాన ఆర్‌అండ్‌బి రహదారిలో నల్లూరిపాలెం, సింగుపాలెం, పోటుమెరక మధ్య భారీగా గుంతలు ఏర్పడ్డాయి. సగానికిపైగా రహదారి కోతలకు గురైంది. తుమ్మల మంచినీటి ఓవర్‌హెడ్ టాంక్ వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. మృత్యుంజయపాలెం నుంచి గంగడిపాలెం వెళ్ళే ప్రధాన రహదారి, గంగడిపాలెం నుంచి అడవిపాలెం మీదుగా రాజుకాల్వ వరకు ప్రధాన రహదారి దెబ్బతింది. బొబ్బర్లంక నుంచి గంగడిపాలెం వరకు రహదారి అంతా గుంతల మయంగా ఏర్పడి రోడ్డుకు ఇరువైపులా తుమ్మచెట్లు ఇరువైపులా భారీగా పెరిగాయి. నిజాంపట్నం మండలం మంత్రిపాలెం నుంచి అడవులదీవి వెళ్ళే రహదారి గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిజాంపట్నం వెళ్ళే ప్రధాన రహదారి ఇసుకపల్ల సమీపం, గుడ్డికాయలంక, లాకుల వద్ద, సజ్జావారిపాలెం వెళ్ళే పల్లపట్ల సమీపంలో, కొమరవోలు అడ్డరోడ్డు వద్ద, రహదారి మధ్యలో గుంతలు ఏర్పడి ఛిద్రమైంది. రేపల్లె నుంచి పల్లెకూన వెళ్ళే రహదారి గుంతలపడి ప్రమాదభరితంగా మారింది. పెనుమూడి నుంచి ఓలేరు వెళ్ళే ప్రధాన రహదారి అధ్వాన్నంగా తయారవటంతో ఈ మధ్యకాలంలోనే లారీ, బైక్‌లు, కార్లు, ప్రమాదాలకు గురై ఐదుగురు మృతిచెందారు. అసలే వర్షాకాలం కావటంతో రహదారిపై వర్షపునీరు నిలవటంతో గుంతల లోతు తెలియక ప్రయాణీకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రయాణీకులు రహదారులు మరమత్తులు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలులేవు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృషిసారించి రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని కోరుతున్నారు.



కోసుకుపోయిన అడవుల దీవి రహదారి

యంత్రాంగం.. ఇసుక బాట

- సుప్రీంకోర్టు ఆదేశాలతో ఇసుక రీచ్‌లలో తనిఖీలు
- క్షేత్రస్థాయి పరిశీలనతో నివేదిక
- ప్రతి వారం ఇదే రీతిన తనిఖీలు ఉంటాయని ప్రకటన

బాపట్ల, మే 20 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ తవ్వకాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి సంబంధిత శాఖలకు నివేదిక ఇవ్వాలనే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సోమవారం ఇసుక రీచ్‌ల బాట పట్టింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌తో పాటు ఆర్డీవోలు, తహసీల్దార్లతో పాటు పలు శాఖల యంత్రాంగం తనిఖీల్లో పాల్గొంది. జిల్లాలోని కొల్లూరు, రేపల్లె, భట్టిప్రోలు, కొరిశపాడు, అద్దంకి మండలాల పరిధిలోని ఇసుక రీచ్‌లను పరిశీలించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి వారం తనిఖీలను జరుగుతాయని, వాటి ఆధారంగా నివేదికను అందిస్తామని అధికారులు చెబుతున్నారు

అంతా దోచేశాక హడావిడి..

ఇసుక రీచ్‌ల తనిఖీల పేరిట జిల్లాలో జరుగుతున్న హడావిడి పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల పాటు సహజ వనరుల విధ్వంసం జరిగిందని, రాజకీయ ఒత్తిళ్లతో అటువైపు చూసే సాహసం కూడా అధికారులు చేయలేదని అంతా దోచేశాక ఇప్పుడు అక్రమ ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేస్తామనే ప్రకటనలు పట్ల జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకుని వైసీపీ పెద్దలు కోట్లు దండుకున్నారని, జరిగిన దోపిడీపై విచారణ చేయాలని టీడీపీ డిమాండ్ చేస్తోంది. సుప్రీంకోర్టుకు అధికారులు ఇచ్చే నివేదికలో ప్రస్తుతం రీచ్‌ల దగ్గర పరిస్థితితో పాటు గతంలో జరిగిన దోపిడీ, పర్యావరణానికి ఏ విధంగా హాని తలపెట్టారు అనే అంశాలను కూడా అందులో పొందుపర్చాలని జిల్లా ప్రజలు కోరుతుఃన్నారు

ఇసుక అక్రమ తవ్వకాలు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

కొల్లూరు: ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రించాలని కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుల్లంక, పెదలంక గ్రామాల పరిధిలోని జేపీ వెంచర్స్, జీసీకేసీ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలను కలెక్టర్, ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి పరిశీలించారు. జువ్వలపాలెంలో ప్రస్తుతం ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయా లేదా అని ఓ మత్స్యకారుని అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో జేపీ వెంచర్స్ ఇసుక తవ్వకాల నిమిత్తం గుర్తించిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరిగినట్లు మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ కలెక్టర్‌కు చెప్పారు. గాజుల్లంక వద్ద కృష్ణానదిలో జరిగిన ఇసుక తవ్వకాలను కలెక్టర్ పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఈ పరిధిలో ఉంటే వీటిని అడ్డం పెట్టుకుని గాజుల్లంక నుంచి ఈపూరు వరకు తవ్వకాలు జరిపారని కొందరు వ్యక్తులు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఈపూరు వద్ద పెదలంక పరిధిలో జరిగిన తవ్వకాల వద్దకు కలెక్టర్ వెళ్లారు. అక్కడ తవ్వకాలు పూర్తి స్థాయిలో జరిగిన ప్రాంతానికి కలెక్టర్, ఎస్పిలను మైనింగ్, రెవెన్యూ అధికారులు తీసుకు వెళ్లకపోవడం గమనార్హం. ఆయా ప్రదేశాల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై కేసులు నమోదు చేయాలని ఆర్డీవో హేలాషారోన్‌కు సూచించారు. పరిశీలన కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి, ఆర్‌డబ్ల్యు ఎస్, ఇరిగేషన్, రివర్ కన్జర్వేషన్, పొల్యూషన్, తదితర శాఖల అధికారులతో పాటు తహసీల్దార్ పుల్లారావు, ఏఈ సురేష్, ఆర్ఐ త్రివేణి, పోలీసు శాఖ, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమాలు బయటపడకుండా..

కలెక్టర్, ఎస్పీల కళ్లకు ఇసుక అక్రమ తవ్వకాలు కనబడకుండా మైనింగ్ అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. జువ్వలపాలెం, గాజుల్లంక ప్రాంతాల్లో అక్రమ తవ్వకాల అనవాళ్లు కనిపించకపోవడంతో ఆయా ప్రాంతాలను ఉన్నతాధికారులకు చూపించారు. ఈ క్రమంలో భారీగా ఇసుక అక్రమ తవ్వకాలు అరవింద వారధి దిగువన ఉన్న పెనర్లంక గ్రామ పరిధిలో జరిగాయని కలెక్టర్ దృష్టికి రావడంతో మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ కొంత కంగారుకు గురయ్యారు. కలెక్టర్ ఆ ప్రాంతంలోనూ పరిశీలన చేద్దామని చెప్పడంతో చేసేదేమీ లేకపోవడంతో ఇసుక తవ్వకాలు కనిపించని దారిలో వారిని తీసుకు వెళ్లారు. పెనర్లంక అరవింద వారధి వద్దకు తీసుకు వెళితే జీసీకేసీ ఆధ్వర్యంలో ఎటువంటి అనుమతులు లేని చోట పట్టా భూముల్లో సైతం గత మూడు నెలలుగా భారీ యంత్రాలతో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలు కలెక్టర్, ఎస్పీ దృష్టికి వచ్చేవని మైనింగ్ ఏడీపై స్థానికులు ఆరోపణలు గుప్పిస్తున్నారు.



జువ్వలపాలెం వద్ద అక్రమ ఇసుక తవ్వకాల గురించి మత్స్యకారులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ వకల్ జిందాల్

ఇండియా శ్రామిక మార్కెట్

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరంలేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.

విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేథ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగినవారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షల కొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ.

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్.

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్.

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియోఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్.

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు: ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్‌ఆర్‌ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/జెనెటిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్యసమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/EtCsnUxలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టీ ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి. ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

పవర్‌ఫుల్ అవతార్‌లో...

మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన



పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వార్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

పాత సినిమా.. కొత్త వివాదం



పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే .. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.



ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు. సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బొరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పోయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్టర్ రూపొందిస్తున్నారు. 'ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, దయ్యూ డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబి'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్ట్‌లు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/XKJOAG0 లో చదవండి.

ప్రభుత్వ స్థలం.. కబ్జాకు యత్నం

● విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్నే కాజేసిన ఘనులు

● న్యాయం చేయాలంటూ విద్యుత్ అధికారుల విన్నపం

దాచేపల్లి, మే20: దాచేపల్లిలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువైంది. ప్రభుత్వ స్థలాలకు కూడా డీకే పట్టాలు పుట్టించి మావేనంటూ ఆక్రమించుకోవాలని చూడటంతో అధికారులు న్యాయం చేయాలంటూ న్యాయస్థానాన్ని, రెవెన్యూ అధికారులను కోరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దాచేపల్లి విద్యుత్‌శాఖ ఏడీఈ వీరేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. సుమారు 60 సంవత్సరాల క్రితం నడికూడి గ్రామ శివారులోని 33/11 కెవి నడికూడి సబ్‌స్టేషన్‌కు స్థలం ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ స్థలంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కాగా దాచేపల్లికి చెందిన కొందరు వ్యక్తులు ఆ స్థలానికి డీకే పట్టా పుట్టించి మాదేనంటూ స్థలంలోకి ప్రవేశించి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేశారు. దీంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేశామని తెలిపారు. పట్టా పుట్టించిన వ్యక్తులు డిపార్ట్‌మెంట్ వారి సామాగ్రిని విసిరివేయడం, అక్కడున్న సిబ్బందిపై దౌర్జన్యం చేయడం జరిగిందని తెలిపారు. ఈ విషయంపై దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామన్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకోవడం పరిపాటిగా మారిందని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ స్థలంపై దాచేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న గీతావాణి డీకే పట్టా పొందిన గరికపాటి భానురేఖ భర్త విశ్వనాథంకు ఎటువంటి సంబంధం లేదని లిఖితపూర్వకంగా వివరించారు. ఈ స్థలంపై పూర్తిగా విద్యుత్‌శాఖ పరిధిలోనే వుందని, ఈ విషయంపై ఎటువంటి అనుమానాలకు తావులేదని ఆమె స్పష్టం చేశారు. విద్యుత్ సబ్‌స్టేషన్ చుట్టూ వేసిన ఫెన్సింగ్ సదరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిదిలోనే వుందని తహసీల్దార్ గీతావాణి స్పష్టం చేశారు. అయినప్పటికీ పట్టా పొందిన వ్యక్తులు మాత్రం తమ ఆగడాలు మాత్రం ఆపడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ఆక్రమణదారుల నుంచి స్థలాలను కాపాడాల్సిందిగా కోరుతున్నారు.



వెంకటపాలెం శిబిరంలో నిరసన తెలుపుతున్న మహిళలు

అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యం

● 1616వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మే 20: అమరావతి అభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1616వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. సీఎం జగన్‌రెడ్డి ఆడిన మూడు రాజధానుల ఆటలో వ్యవస్థలంతా అస్తవ్యస్తం అయ్యాయని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కాకుండా రాజకీయ లబ్ధికోసం మూడు ముక్కలాటను జగన్‌రెడ్డి ఆడుతున్నారు. అందుకే ఈ ఎన్నికల్లో వైసీపీ ఇంటికి పోవటం ఖాయమని స్పష్టం చేశారు. రాష్ట్ర నడిబొడ్డులో ఉన్న అమరావతిని ప్రజలు కోరుకుంటుంటే వారి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా మూడు రాజధానులని ఆంధ్రప్రదేశ్‌కి విలువ లేకుండా చేశాడన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.

70 శాతం రైళ్లు రద్దు



● డజన్ల కొద్దీ రైళ్లు రద్దుతో ప్రయాణికులకు ఇక్కట్లు

● సింహాద్రి, గోల్కొండ సహా పలు ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్ల రద్దు

● వేసవి సెలవలు, ఎన్నికల సమయంలోనూ పునరుద్ధరణ కరువు

● మూడు నాలుగు నెలలకు పైగా సింహాద్రి, గోల్కొండ

● ఆధునికీకరణ కోసమా? లేక ఆదాయం కోసమా?

● గూడ్స్‌రైళ్ల కోసమేనంటూ విమర్శల వెల్లువ

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతికి ఇరువైపులా వున్న రెండు నగరాల మధ్య రైలు రాకపోకలు దారుణంగా పడిపోయాయి. కేవలం 30 కిలోమీటర్ల దూరంలో వున్న విజయవాడ, గుంటూరుల మధ్య ఉదయం 10 దాటిన తరువాత, సాయంత్రం 5 గంటలలోపు రైలు ప్రయాణ సదుపాయం లేదంటే నమ్ముతారా? నమ్మక పోయినా అదే నిజం! ఈ రెండు నగరాల మధ్య సికింద్రాబాద్- గుంటూరు మధ్య నడిచే సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌తో సహా అన్ని రైళ్లు అన్నీ రద్దయిపోయాయి. దాదాపు నెలల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రోజు రోజుకు రద్దయ్యే రైళ్ల సంఖ్య పెరగడమే తప్ప తగ్గడం కనిపించడంలేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైల్వేలో రద్దుల పర్వం

కొవిడ్ మహమ్మారి రాకకు ముందు సామాన్య, పేద ప్రయాణికులకు సేవలు అందించిన రైల్వే ఆ తరువాత క్రమంగా దూరమవుతూ వస్తోంది. కొవిడ్ సందర్భంగా కేంద్ర ప్రకటించిన లాక్‌డౌన్‌తో దాదాపు 2 నెలలు ఆగిపోయిన రైళ్లు అనంతరకాలంలో కూడా సామాన్యులకు అందుబాటులోకి రాలేదు. లాక్‌డౌన్ పూర్తై మూడేళ్లు పూర్తయినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ పూర్తిస్థాయిలో ప్రయాణికుల రైళ్లను పునరుద్ధరించలేదు. స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ల పేరుతో నడుపుతున్న రైళ్లలో ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తుండడంతో సామాన్య, పేద ప్రజలపై భారం రెండు, మూడు రెట్లు పెరిగింది. ఎన్నికలకు నెల రోజుల ముందు వరకూ స్పెషల్ చార్జీలు వసూలు చేసిన రైల్వేశాఖ ఎన్నికల కారణంగా పాసింజర్ రైళ్లపై వేసిన స్పెషల్ చార్జీలను పాతరేట్లకు తగ్గించింది. కానీ టిక్కెట్ రేట్లు తగ్గాయన్న ఆనందం ప్రజలకు మిగలలేదు. ఎందుకంటే దాదాపు 70 శాతం రైళ్లు రద్దయ్యాయి.

నెలల తరబడి డజన్ల కొద్దీ రైళ్ల రద్దు

గడిచిన ఆరు, ఏడు నెలలుగా విజయవాడ డివిజన్లో రైళ్లు విపరీతంగా రద్దవుతున్నాయి. మెయింటెనెన్స్ పేరుతో నెలల తరబడి రైళ్లు ఆపేస్తున్నారు. దీంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం వెళ్లే సింహాద్రి, గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు జిల్లా ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయి. గడిచిన నాలుగు నెలల్లో పట్టుమని పది రోజులు కూడా ఈ రైళ్లు నడవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గడిచిన కొన్ని నెలలుగా సింహాద్రిగోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేయడంతో గుంటూరు నుంచి ప్రధాన నగరాలైన సికింద్రాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, అన్నవరం, వరంగల్ వెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు తాజాగా విజయవాడ మీదుగా వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను కూడా తాజాగా రద్దవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. విజయవాడ- గుంటూరు- తెనాలి- విజయవాడ సర్క్యులర్ ట్రైన్లు దాదాపు రెండు నెలలుగా కనిపించడం లేదు. విజయవాడ నుంచి నరసాపురం, మచిలీపట్నం వెళ్లే రైళ్లు కూడా రద్దయ్యాయి. గుంటూరు నుంచి మాచర్ల, హుబ్లీ వెళ్లే రైళ్లు కూడా రద్దవడంతో పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నరసరావుపేట, వినుకొండ, మార్కాపురం వైపు వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదు. తెనాలి మీదగా వెళ్లే పలు రైళ్లు రద్దయ్యాయి. కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లించారు. తిరుపతి ఎక్స్‌ప్రెస్, బిట్రగుంట పాసింజర్ రద్దు చేశారు. గ్రామీణ ప్రజలు ఆధార పడే పాసింజర్ రైళ్లు దాదాపుగా రద్దయ్యాయి. విజయవాడ గూడూరు, విజయవాడ ఒంగోలు రైళ్లు రద్దవడంతో బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడురు వెళ్లే ప్రయాణికులకు బస్సులే దిక్కయ్యాయి.

మోయలేని బస్సుల భారం

రైళ్లు రద్దవడంతో బస్సుల్లో వెళదామంటే బస్సు చార్జీల పేరు వింటే ప్రయాణికుల గుండెలు గుబేలు మంటున్నాయి. ప్రయాణికులపై దయలేని రాష్ట్ర ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లలో మూడుసార్లు బస్ చార్జీలు పెంచింది. దీంతో బస్ చార్జీలు భారం మూడు, నాలుగు రెట్లు పెరిగింది. రైలులో 30, 40 రూపాయలతో గమ్యస్థానం చేరేవారు బస్సులో వెళ్లాలంటే 200 నుంచి 300 రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో చాలామంది సామాన్యులు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పిల్లలకు వేసవి సెలవులు రావడం, సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి సొంత ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తడంతో ప్రయాణాలు కూడా వాయిదా వేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వందల రూపాయలు ధారబోసి బస్సుల్లో, ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తోంది.

రైల్వే అధికారులు రైలు పట్టాల మరమ్మతు, రూటు ఆధునికీకరణ పేరుతో రైళ్లు రద్దు చేస్తూ పోతున్నారు. వారమో, పది రోజులో మరమ్మతు పనులు వుండడం సహజం అనుకుని సర్దుకుపోతున్నా నెలలు తరబడి రద్దుల పర్వం కొనసాగుతోంది. గడిచిన ఆరు నెలలుగా వారం పదిరోజులకు మించి పలు రైళ్లు పట్టాలు కూడా ఎక్కని పరిస్థితి కనిపిస్తోంది. మరో వైపు సరుకు రవాణా వాహనాల జోరు కొనసాగుతూనే ఉంది. సరుకు రవాణా వాహనాల ద్వారా ఆదాయం వచ్చే అవకాశం వుండడం వల్ల రైల్వే శాఖ ఆ దిశగా ఆలోచిస్తోందని, లాభదాయకం కాని ప్రజా రవాణాను కావాలనే నిర్లక్ష్యం చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన గుంటూరు, విజయవాడల మధ్యనే రైలు ప్రయాణాలు కరువవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం రైల్వే అధికారులతో మాట్లాడడంగానీ, ప్రయాణికుల సదుపాయార్థం చర్యలకై ఒత్తిడి తేవడం కానీ చేయకపోవడం పట్ల ప్రయాణికుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

అల్లర్లపై.. ఆరా

● పల్నాడు జిల్లాలో ఘటనలపై 22 కేసులు నమోదు

● 581 మందిని నిందితుల గుర్తింపు

● కొనసాగుతున్న సిట్ దర్యాప్తు


నరసరావుపేటలో హింసాత్మక సంఘటన జరిగిన మునిసిపల్ హైస్కూల్ ఏరియాను పరిశీలిస్తున్న సిట్ ఎస్పీ సౌమ్యలత

నరసరావుపేట, మే 20: పోలింగ్, ఆ తర్వాత జిల్లాలో చెలరేగిన హింసాత్మక ఘటనలపై 22 కేసులు నమోదయ్యాయని సిట్ ప్రకటించింది. నరసరావుపేటలో సోమవారం కూడా సిట్ విచారణ కొనసాగింది. రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఐదు కేసులపై సిట్ అధికారిణి సౌమ్యలత వివరాలు సేకరించారు. పట్టణంలో హింసాత్మక ఘటలను జరిగిన ప్రదేశాలను ఆమె పరిశీలించారు. మునిసిపల్ ఉన్నత పాఠశాల, గుంటూరు రోడ్డులలో జరిగిన అల్లర్లపై ఆరా తీశారు. జిల్లాలో జరిగిన అరాచకాలపై ప్రాథమిక నివేదికను డీజీపీకి అందజేశారు. మూడు రోజులుగా జిల్లాలో సిట్ అధికారులు జరిపిన విచారణకు సంబంధించిన వివరాలను నివేదికలో పొందుపరిచారు. జిల్లాల్లో నమోదైన 22 కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను సిట్ బృందం పరిశీలించింది. ఈ కేసుల్లో మొత్తం 581 మందిని ముద్దాయిలుగా పేర్కొన్నారు. వీరిలో 274 మందిని గుర్తించారు. 307 మందిని గుర్తించాల్సి ఉందని సిట్ తెలిపింది. ఇప్పటివరకు 19 మందిని అరెస్టు చేవారు. 91 మందికి 41 నోటీసులు ఇచ్చారు. హింసాత్మక ఘటనలకు పాల్పడిన ఇంకా 471 మందిని అరెస్టు చేయాలని నిదికలో పేర్కొన్నారు. నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

క్షేత్ర స్థాయిలో హింస జరిగిన ప్రదేశాలను సిట్ బృందం స్వయంగా పరిశీలించింది. పోలీసులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలను సేకరించింది. కేసుల దర్యాప్తులో లోపాలు ఉన్నట్టు సిట్ గుర్తించింది. నమోదైన ఎఫ్ఐఆర్‌లో కొత్త సెక్షన్లు చేర్చే అంశంపైనా సిట్ సదరు అధికారులను ఆదేశిస్తోంది. దీంతో సదరు అధికారులు కంగుతింటున్నారు. హింస జరుగుతుందని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోవడంలో కొందరు పోలీసు అధికారులు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యంతగా వ్యవహరించినట్టు సిట్ గుర్తించింది. కొందరు రాజకీయ పార్టీల నేతలతో పోలీసులు కుమ్మక్కై దాడులు జరుగుతున్నా చూసీచూడనట్టు వ్యవహరించారని సిట్ నిర్ధారించినట్టు తెలిసింది. హింసాత్మక సంఘటనలకు వినియోగించిన పెట్రోలు బాంబులు, కర్రలు, రాళ్లు, ఇనుపరాడ్లు వంటి సామాగ్రికి సంబంధదించిన ఆధారాలను కూడా సిట్ అధికారులు సేకరించారు. ఈ నేపథ్యంలో కొందరు రాజకీయ నేతలను కూడా అరెస్టు చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

నరసరావుపేట పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్లలో సిట్ అధికారిణి సౌమ్యలత మూడు రోజులుగా విచారిస్తున్నారు. సోమవారం రాత్రి కూడా రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. కారంపూడి, దాచేపల్లి, రెంటచింత పోలీసు స్టేషన్‌లకు సిట్ వెళ్లి హింస ఘటలనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించింది. జిల్లాలో మిగతా చోట్ల జరిగిన ఘటనలపై కూడా విచారించేందుకు సిట్ సిద్ధమవుతోంది. మాచర్ల, గురజాల, నరసరావుపేట నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలకు సంబంధించి ప్రాథమిక విచారణ నివేదికను డీజీపీకి సమర్పించింది. మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి, మాచర్ల రూరల్, పట్టణం, సత్తెనపల్లి, పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో జరిగిన హింసపై కూడా సిట్ విచారించాల్సి ఉంది. పర్యవేక్షణలో భాగంగా జిల్లా స్థాయిలో నిందితులను గుర్తించి వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉన్న సెక్షన్‌లకు తగిన చట్టంలోని సెక్షన్‌లను జోడించడం కోసం సంబంధిత కోర్టుల్లో మెమో దాఖలు చేయాలని దర్యాప్తు అధికారులకు సిట్ సూచించింది. సీసీ ఫుటేజీలు, వీడియోలు డిజిటల్ సాక్ష్యాలను సేకరించాలని, నిందితులను అరెస్టు చేయడంతో పాటు చార్జ్ షీట్ దాఖలు చేయాలని సిట్ ఆదేశించింది. సిట్ విచారణ ముమ్మరంగా సాగుతుండటంతో అధికార పార్టీ నేతలతో అంటకాగిన అధికారుల్లో గుబులురేపుతోంది.

అన్నా... నీకే ఓటేశా!

● ఏ నాయకుడు ఎదురైనా ఓటరు ఇదే సమాధానం

● ఓటు రహస్యాన్ని బయటపెట్టకుండా జాగ్రత్త

గుంటూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈవీఎంలో తన ఓటుని తనకు ఇష్టమైన పార్టీకి వేసి నిక్షిప్తం చేసిన ఓటరు పోలింగ్ ముగిసిన తర్వాత ఎంతో తెలివితనాన్ని ప్రదర్శిస్తున్నాడు. స్థానిక రాజకీయ పార్టీల నాయకులు ఎవరైనా ఎదురుపడి ఏ పార్టీకి ఓటు వేశావని అడిగితే అన్నా... మన పార్టీకి వేయక ఇంకెవరికి వేస్తానంటూ సమాధానం ఇస్తున్నాడు. తద్వారా ఆయా పార్టీల నేతల్లో గెలుపు ఆశలను పెంచుతున్నాడు. చాలామంది ఓటర్లు ఇరు పార్టీల నాయకులు పంచిన నగదుని తీసుకొని తమకు ఇష్టమైన పార్టీకే ఓటు వేశారు. దీని వలన డబ్బు ప్రభావం అనేది ఈ ఎన్నికల ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపించదు. ఓటరు చెబుతున్న సమాధానంతో ఎవరికి వారు తమదే గెలుపు అని అంచనాలు వేసుకొంటున్నారు. అయితే ఓటర్లు ఎక్కువగా ఏ పార్టీకి జై కొట్టారనేది జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుతో తేలిపోతుంది.

జిల్లాలో ఈ దఫా ఎన్నికలు చాలా కాస్ట్‌లీగా జరిగాయి. జనవరి నెల నుంచే ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తూ అన్ని పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాలను నిర్వహించారు. ధూంధాంగా డీజే సౌండ్ సెట్లతో వాతావరణాన్ని వేడెక్కించారు. అధికార వైసీపీ నేతల చేతుల్లో డబ్బులు ఉండటంతో అప్పటి నుంచే వార్డుల్లో మీటింగ్‌లు పెట్టడం, భోజనాలు ఏర్పాటు చేయడం వంటివి నిర్వహించారు. మరోవైపు టీడీపీ అభ్యర్థులు డోర్-టూ-డోర్ వెళ్లి ఓటర్లను కలుసుకొని చంద్రబాబు ప్రకటించిన సూపర్ 6ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారి ఆదరాభిమానాలు పొందడంపై దృష్టి పెట్టారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ప్రచారాలకు కూడా అన్ని పార్టీలు బాగానే ఖర్చు చేశాయి.

పోలింగ్‌కి రెండు, మూడు రోజుల ముందుగా ఓటర్లకు డబ్బు పంపిణీకి తెర లేపాయి. నియోజకవర్గాన్ని బట్టి రూ. వెయ్యి నుంచి రూ.3,500 వరకు పంచారు. ఈ క్రమంలో కొంతమంది చోటామోటా నాయకులు ఓటర్లకు డబ్బు పంచకుండా నొక్కేసి పంచామని నేతలకు చెప్పుకొన్నారు. వైసీపీలో ఇలా ఎక్కువగా జరిగింది. అభ్యర్థులు ఇంచుమించు సరిసమానంగానే నగదుని ఓటర్లకు పంచారు. దీని వలన ఓటరు డబ్బు తీసుకొన్నాడు కాబట్టి ఒక పార్టీ వైపు మొగ్గు చూపుతారన్నది నిజం కాదని తేలింది. ఇరు పార్టీల వద్ద డబ్బు తీసుకొన్న ఓటర్లు పోలింగ్ రోజున తెల్లవారజామునే బూత్‌ల వద్దకు వెళ్లి క్యూలైన్లలో నిలుచుని ఓటేసి వచ్చేశారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లే ముందు కూడా రెండు పార్టీల అభ్యర్థులు తమకే ఓటు వేయాలని అభ్యర్థించగా ఓటరు చిరునవ్వుతో మీకేనన్నట్లు సమాధానం ఇచ్చారు. బయటకు వచ్చేటప్పుడు కూడా ఎక్కడా తన ఓటు గోప్యతని బయట పెట్టలేదు. ఎవరడిగినా మీకేనన్నట్లుగా సమాధానం చెప్పారు. దానిని నేటికీ అలానే కొనసాగిస్తున్నారు. దీంతో బెట్టింగులపై ఎవరూ ధీమాగా లేరు. కూటమి తరుపున చాలామంది రూ.లక్షకు రూ.లక్షన్నర ఇస్తామని బెట్టింగ్‌కు ప్రతిపాదిస్తున్నా వైసీపీ తరపున ఎవరూ ముందుకు రాని పరిస్థితి కొనసాగుతోంది.

డిగ్రీ 6వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

పెదకాకాని, మే 20: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు నిర్వహించిన డిగ్రీ కోర్సుల 6వ సెమిస్టర్ ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఏ ఓఎల్ కోర్సుల ఫలితాలు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు మాట్లాడుతూ 23,450 మంది హాజరవగా 23,240 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

వర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న ఏఎన్‌యూ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ గడువు తేదీని పొడిగించినట్లు సోమవారం అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ అనిత తెలిపారు. అరు లైన అభ్యర్థులు జూన్ 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఈ కోర్సులను అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ టెస్ట్ ద్వారా బీటెక్ ప్లస్ ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ఇంజనీరింగ్ విద్యను వర్సిటీ అందిస్తుందని పేర్కొన్నారు. సీఎస్‌ఈ, ఈసీఈ, ఎంఈ, సీఈ, ఈఈఈ, ఈసీఈ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంజనీరింగ్, మెషిన్ లెర్నింగ్, బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని డాక్టర్ అనిత తెలిపారు.

కిడ్నాప్ కేసులో నలుగురు అరెస్టు

చిలకలూరిపేట, మే 20: ఒక స్థల వివాదం కేసులో వ్యక్తి కిడ్నాప్ ఘటనకు సంబంధించి నలుగురు వ్యక్తులను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొత్త రాజాపేటలో మూడు సెంట్ల స్థలానికి సంబంధించి ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం ఉంది. చిలకలూరిపేట మండలం పోతవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ ఉయ్యాల శివనాగరాజు ఈ వివాదానికి సంబంధించి తనను కిడ్నాప్ చేశారంటూ అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లింగంగుంట్ల గ్రామానికి చెందిన మొగిలి శ్రీను, మరో ఆరుగురు కలసి తన కాళ్ళు, చేతులు తాళ్ళతో కట్టి వేసి కిడ్నాప్‌కు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. శివ నాగరాజు తప్పించుకొని పారిపోయి వచ్చి తగు న్యాయం చేయాలని అర్బన్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అర్బన్ ఎస్ఐ సుమన్ దర్యాప్తు చేపట్టారు. విచారణ అనంతరం మొగిలి శ్రీనుతో పాటు మరో ముగ్గురిని ఈ కేసులో అరెస్టు చేశారు. మరి కొందరిని అరెస్టు చేయాల్సి ఉంది.

1281 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, మే 20: స్థానిక పసుపుమార్కెట్‌యార్డులో సోమవారం జరిగిన వేలంలో 1281 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,800 గరిష్ఠధర రూ. 14,200 మోడల్‌ధర రూ.13,600 పలికాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,800 గరిష్ఠధర రూ. 13,825, మోడల్‌ధర రూ.13,600 పలికాయి.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేతికి సంకెళ్లా?

గుంటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): హంతకులు, బందిపోట్లకు వేసినట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చేతులకు సంకెళ్లు వేయడమేంటని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, టీడీపీ నేతలు పోలీసులను నిలదీశారు. పల్నాడు జిల్లా మాచవరం ఎంపీపీ కుమారుడిపై జరిగిన దాడి కేసును అడ్డంపెట్టుకుని, సంబంధంలేని టీడీపీ కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు వారిని మూడు రోజులపాటు తీవ్రంగా కొట్టి హింసించి, వారిపై హత్యాయత్నం కేసు నమోదుచేసి సోమవారం న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. గాయాలను పరిశీలించిన న్యాయమూర్తి వారివద్ద వాంగ్మూలం తీసుకొని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి పంపించారు. గుంటూరు సబ్ జైల్లో ఉన్న నిఖిల్, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రైతు మోహన్ రావుని ఆసుపత్రికి తీసుకు వెళ్లే సమయంలో వారి చేతులకు పోలీసులు బేడీలు వేసేందుకు ప్రయత్నించారు. దాన్ని గమనించిన టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు బేడీలు వేయడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వారేమైనా బందిపోట్లా, నక్సలైట్లా అంటూ పోలీసులను నిలదీశారు. అయినా వెనక్కు తగ్గని పోలీసులు బేడీలు వేసి తీరాల్సిందేనని పట్టుబట్టారు. కనపర్తి కూడా అదేస్థాయిలో తీవ్రంగా ప్రతిఘటించటంతో పోలీసులు వెనక్కు తగ్గి బేడీలు వేయకుండానే ఆటోలో వారిరువురినీ ఆసుపత్రికి తీసుకువెళ్లారు.


బేడీలు వేస్తున్న పోలీసులను అడ్డుకుంటున్న కనపర్తి, టీడీపీ నేతలు

దేవుడి మాన్యం భూమి.. కబ్జాకు యత్నం

● రాత్రికి రాత్రి భూమిలో సిమెంటు పిల్లర్లు ఏర్పాటు ● పట్టించుకోని దేవాదాయ శాఖ అధికారులు



దేవుడి మాన్యం భూమిలో సిమెంటు పిల్లర్లు వేసిన దృశ్యం

తాడికొండ, మే20: తాడికొండ అడ్డరోడ్డు నుంచి తాడికొండకు వచ్చే ప్రధాన రహదారిలోని గొడుగు కంపెనీ ఎదురుగా ఉన్న దేవుడి మాన్యం భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. అదే తడవుగా భూమిని చదును చేయటమే కాకుండా ఏకంగా సిమెంటు పిల్లర్లు వేశారు. కోట్ల రూపాయాలు విలువచేసే భూమిని దోచుకోవటానికి సిద్ధం అయిన విషయం తెలిసినా దేవాదాయ శాఖ అధికారులు పట్టించునే పరిస్థితి లేదు. దేవుడి మాన్యం భూమిని కబ్జా చేసేందుకు ఓ వైసీపీ నాయకుడు సిద్ధమయ్యాడు. తన దగ్గర భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయని బుకాయిస్తున్నాడు.

తాడికొండ గ్రామంలోని వేణుగోపాలస్వామి వారి ఆలయానికి సంబంధించిన భూములు సర్వే నెంబరు 100, 170ఏ, 120, 99లో 15.45 ఎకరాలు దేవుడి మాన్యం ఉంది. దీనిలో సుమారు 60 సెంట్ల భూమిని చదును చేసి రాత్రి రాత్రికే గోతులు తీసి సిమెంటు పిల్లర్లు వేశారు. దేవుడి మాన్యాన్ని కొన్ని సంవత్సరాలుగా గ్రామానికి చెందిన కూరపాటి శివయ్య కౌలు చేసుకుంటున్నారు. అయితే పొలంలో సిమెంట్ పిల్లర్లు వేశారనే విషయం తెలిసిన శివయ్య అవాక్కయ్యారు. దీంతో దేవాదాయ శాఖ అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. దీంతో అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా ఇంత వరకు ఎలాంటి ఫలితం లేదు. సిమెంటు పిల్లర్లు వేసి 10 రోజులు గడుస్తున్నా భూమిని ఆక్రమించిన వారిని గుర్తించి ఏలాంటి చర్యలు చేపట్టకపోవటంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి తెలుగురాష్ట్రాల ఆహ్వాన నాటికల పోటీలు

పెదనందిపాడు, మే, 20 : గుంటూరు జిల్లా పెదనందిపాడు మండల పరిధిలోని వరగాని అంకమ్మగుడి ఆవరణలో లావు వెంకటేశ్వర్లు, కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు నేటి రాత్రి నుండి ప్రారంభించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. దీనికి కావలసిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు.

మొదటి రోజు అభినవ ఆర్ట్స్ గుంటూరు వారి ఇంద్ర ప్రస్థం, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి కౌస ల్యాసుప్రజారామ, తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత అనే నాటికలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

అక్రమ కేసులు పెట్టిన డీఎస్పీపై ఫిర్యాదు చేశాం

● మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్


విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, చీరాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్

బాపట్ల, మే 20: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు, మరుసటి రోజు చీరాల నియోజకవర్గంలో జరిగిన అనేక సంఘటనలలో ప్రత్యర్థులపై పెట్టాల్సిన కేసులు తమపై పెట్టారని మాజీ ఎమ్మెల్యే చీరాల కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. ఈ విషయమై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 7 కేసులలో తమ అనుచరులు 60మందిపై చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అక్రమంగా కేసులు పెట్టారన్నారు. దీనిపై ఎస్పీకి వివరించి వాటిని పునఃపరిశీలించాలని కోరామన్నారు. ఒక స్పెషల్ అధికారితో విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరామన్నారు. ఎస్పీ దీనిపై సానుకూలంగా స్పందించినట్లు కృష్ణమోహన్ తెలిపారు.

రెడ్‌క్రాస్ భవనంలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులు

బాపట్ల, మే 20: భారీ వర్షాల హెచ్చరికలతో తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను రెడ్‌క్రాస్ భవనంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు సోమవారం తరలించారు. రిటర్నింగ్ ఆఫీసర్, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మొత్తం 13 బాక్సులను తహసీల్దార్ కార్యాలయంలోని గది నుంచి రెడ్‌క్రాస్ గదిలోకి తరలించి సీల్ వేశారు. భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. బాపట్ల నియోజకవర్గంలో మొత్తం 2,899 పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఉండగా 2,719మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అభ్యర్థుల విజయం పోస్టల్ బ్యాలెట్‌లపైనే ఆధారపడి ఉండటంతో వీటిని పూర్తి భద్రత మధ్య స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచారు.

అగ్నివీర్ వాయు నియామక ర్యాలీకి దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, మే 20: అఖిల భారత అగ్నివీర్ వాయు నియామక ర్యాలీకి అర్హత, ఆసక్తి కలిగిన అవివాహిత పురుషులు, స్త్రీలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీర్ వాయు నియామక ర్యాలీ కాన్పూర్, బెంగుళూరులో జరుగుతుందన్నారు. అర్హులైనవారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ ర్యాలీకి అర్హులైన వారంతా 22వ తేదీ నుంచి జూన్ 5 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. తాత్కాలిక అడ్మిట్‌కార్డు పొందిన అభ్యర్థులకు మాత్రమే ఈ ర్యాలీలో ప్రవేశానికి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులకు కేటాయించిన తేదీ, సమయం, వేదిక తాత్కాలిక అడ్మిట్‌కార్డులో ఉంటుందన్నారు. యువతీ, యువకులు గమనించాలని కలెక్టర్ సూచించారు.

పాటల వెల్లువ సిరివెన్నెల

● సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ

బాపట్ల, మే 20: సిరివెన్నెల సీతారామశాస్త్రి తెలుగు సినీ సాహితీ జగత్తులో తరగని వెన్నెలదారలు కురిపించారని, పాటల వెల్లువ సిరివెన్నెల సీతారామశాస్త్రి అని సాహితీ భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. సోమవారం సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సభలో సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ, ఉపాధ్యక్షుడు ఎం.మాల్యాద్రిరావులు సంయుక్తంగా మాట్లాడుతూ సీతారామశాస్త్రి 800 సినిమాలకు దాదాపు 3000 పాటలు రచించారని పేర్కొన్నారు. అనంతరం మస్తాన్‌రెడ్డి, కీర్తి వెంకయ్య, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులతో కలిసి వారు సీతారామశాస్త్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 22న 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కర్లపాలెం, మే 20: కర్లపాలెంలోని 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రంలో 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేస్తున్నామని మండల విద్యుత్ అధికారి మల్లెల కుమార్ తెలిపారు. 22వ తేదీన కర్లపాలెం, బుద్దాం, నందాయపాలెం, ఎంవీ రాజుపాలెం, యాజలి, ఏట్రవారిపాలెం, నల్లమోతువారిపాలెం, దమ్మనవారిపాలెం, దిండువారిపాలెం గ్రామాలలో ఉదయం 8గంటలు నుంచి రాత్రి 8 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని మండల విద్యుత్ వినియోగదారులందరూ సహకరించాలని ఏఈ కోరారు.

జేఈఈ మెయిన్స్‌లో పవన్‌రెడ్డి ప్రతిభ

కర్లపాలెం, మే 20: మండలంలోని పాతనందాయపాలెంకు చెందిన అక్కల రమణారెడ్డి, అరుణ దంపతుల కుమారుడు అక్కల పవన్‌రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనబరిచారని రెడ్డి సేవామిత్ర సంఘం అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి తెలిపారు. జేఈఈ మెయిన్స్‌లో 99.99శాతం మార్కులు సాధించాడని రమణారెడ్డి తెలిపారు. పవన్‌రెడ్డిని ఈ సందర్భంగా దుశ్శాలువా, పూలమాలలతో నంగు గోవర్ధనరెడ్డి, పిట్టు విజయభాస్కర్‌రెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, పిట్ల శ్రీనివాసరెడ్డి, ఆట్ల శ్రీనివాసరెడ్డి, పయనం శ్రీనివాసరెడ్డి, ఆట్ల బాలశంకర్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు.

23న నూకాలమ్మ అమ్మవారి తిరునాళ్ళ

చెరుకుపల్లి, మే 20: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీనూకాలమ్మ అమ్మవారి ఇరునాళ్ళ మహోత్సవం ఈ నెల 23న జరుగుతుందని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పూషడపు దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తిరునాళ్ళకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

వరికుప్ప దగ్ధం


దగ్ధమైన వరికుప్ప

పిట్టలవానిపాలెం, మే 20: మండల పరిధిలోని సంగుపాలెం కోడూరు గ్రామానికి చెందిన బుడ్డా సంజీవరావుకు చెందిన 1.30 ఎకరాల వరికుప్పను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి దహనం చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని చందోలు పోలీసులు తెలిపారు.

నల్లమడ కట్టను తవ్వేస్తున్నారు

● అధికారులు ఎన్నికల విధులలో... అక్రమార్కులు ఇసుక తరలించే పనిలో...


బాపట్ల మండలం తూర్పు పిన్నిబోయనవారిపాలెం సమీపంలో వెంకటరంగాపురం దగ్గర నల్లమడ కట్టను తవ్వి ఇసుకను తరలించిన ప్రాంతం

బాపట్ల, మే 20: ఇసుక దందాకు పాల్పడే అక్రమార్కుల కళ్ళు తరచూ నల్లమడ కట్టలపై పడుతున్నాయి. గతంలో అప్పికట్ల సమీపంలోని నల్లమడ కట్టను పెద్దఎత్తున తవ్వి తరలించారు. అక్కడ రైతులు ఆందోళన చేయటంతో ఉపసంహరించారు. ఆ తర్వాత కొండుభొట్లపాలెం హైస్కూల్ ప్రహరీగోడ పడగొట్టి మరీ దారి ఏర్పాటుచేసుకొని నల్లమడ కట్ట ఇసుకను తవ్వి తరలించారు. తాజాగా అధికారులంతా ఎన్నికల విధులలో బిజీగా ఉన్న సమయాన్ని ఉపయోగించుకొని తూర్పు పిన్నిబోయనవారిపాలెం గ్రామసమీపంలో అడవిగ్రామపంచాయతీ వెంకటరంగాపురం దగ్గర నల్లమడ కట్టను పెద్దఎత్తున తవ్వి ఇసుకను తరిలించారు. పరిసర గ్రామాలలో ప్లాట్‌ల మెరకకు, రియల్‌ఎస్టేట్ వెంచర్లకు తరలించటానికి ఇసుకను ఈవిధంగా పెద్దఎత్తున తరలించినట్లు తెలుస్తున్నది. ఇసుక అక్రమ వ్యాపారంతో కోట్లరూపాయలు సంపాదిస్తున్న వ్యాపారులు బాపట్లలో ఉన్నారు. బడా వ్యాపారులకు తీసిపోమన్నట్లు కొంతమంది చోటా వ్యాపారులు కూడా ఇసుకను అక్రమంగా తరలించి లక్షలు ఆర్జిస్తున్నారు. ఈవిధంగా నల్లమడకట్టను అనేకచోట్ల తవ్వి తరలిస్తున్నారు. విపత్తుల సమయంలో ఎగువప్రాంతాల నుంచి భారీ ఎత్తున వచ్చే వరదనీటి వల్ల కట్టలు బలహీనంగా ఉన్నచోట్ల గండ్లు పడి పొలాలు ముంపునకు గురికావటంతోపాటు గ్రామాలలోకి కూడా వరదనీరు వచ్చే ప్రమాదం ఉంది. అయినప్పటికీ డ్రైనేజీ అధికారులు అక్రమవ్యాపారులపై సరైన చర్యలు తీసుకోవడం లేదు. దీంతో తరుచూ అనేక ప్రాంతాలలో నల్లమడ డ్రెయిన్ కట్టలను తవ్వి తరలిస్తున్నారు..

చర్యలు తీసుకోవాలి : బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి గుదే రాజారావు

నల్లమడ కట్టను తవ్వి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలి. ఈ విషయంలో డ్రైనేజీ అధికారుల పాత్రపై కూడా విచారణ జరిపించాలి. 200 ట్రక్కులకు పైగా ఇసుకను తవ్వి తరలించారు. దీనిపై అధికారులు ఏమాత్రం పట్టించుకోవటంలేదు. కట్ట తవ్విన ప్రాంతాన్ని పరిశీలించాం. దీనిపై కలెక్టర్‌తోపాటు మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తాం. డ్రైనేజి అధికారుల దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్ళాం.

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం : డ్రైనేజి జేఈ భరద్వాజ

వెంకటరంగాపురం దగ్గర నల్లమడ కట్టను తవ్వి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. 54 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, ఒకటిన్నర మీటరు ఎత్తులో ఇసుకను తవ్వి తరలించినట్లు గుర్తించాం. దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకునేలా చూస్తాం. మరొకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తాం.

సత్రం భూమి లీజు వెంటనే రద్దు చేయాలి

● బాపట్ల కాపు సేవాసంఘం నాయకులు, తూర్పు సత్రం భూముల పరిరక్షణ కమిటీ సభ్యుల డిమాండ్

● రద్దు చేయకుంటే ఉద్యమిస్తాం


తూర్పుసత్రం ఎదుట నినాదాలు చేస్తున్న బాపట్ల కాపు సేవాసంఘం నాయకులు, తూర్పుసత్రం భూముల పరిరక్షణ కమిటీ సభ్యులు

బాపట్ల, మే 20: దాతల ఆశయాలను నీరుగారుస్తూ తూర్పు సత్రం భూమిని ఏకపక్షంగా లీజుకివ్వటాన్ని ఖండిస్తున్నట్లు బాపట్ల కాపు సేవాసంఘం నాయకులు, తూర్పుసత్రం భూముల పరిరక్షణకమిటీ సభ్యులు పేర్కొన్నారు. తూర్పుసత్రంకు చెందిన 5 ఎకరాల 50 సెంట్ల భూమిలో 78 సెంట్ల భూమిని దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కి 11 సంవత్సరాలు లీజుకిచ్చినట్లు బయటకు పొక్కింది. దీంతో సత్రం భూముల పరిరక్షణకమిటీ సభ్యులతోపాటు కాపు సేవాసంఘం నాయకులు ఆగ్రహానికి గురయ్యారు. తూర్పుసత్రంను పేరం గరుడాచలం నాయుడు నిర్మించి ఇచ్చిన ఆస్తులను ప్రత్యేక ప్రయోజనాల కొరకు బాపట్ల పరిసర ప్రాంత ప్రజలకు ఉపయోగపడే సేవా దృక్పథంతో ఏర్పాటుచేశారన్నారు. అయినప్పటికీ ఇప్పటికే తూర్పుసత్రం ఆస్తులను అనేకమందికి కారుచౌకగా దారాదత్తం చేశారని, ఆస్తుల వివరాలు, ఆదాయ, వ్యయాలు ప్రజలకు తెలియకుండా, పారదర్శకత లేకుండా దేవదాయశాఖ పరిపాలన సాగిస్తున్న వైనం బాధాకరమన్నారు. కావున వెంటనే లీజును రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాపట్ల ప్రజలు ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణకు పూనుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. బాపట్ల కాపు సేవాసంఘం నాయకులు, తూర్పు సత్రం భూముల పరిరక్షణకమిటీ సభ్యులంతా కలిసి సత్రంలోని పేరం గరుడాచలం నాయుడు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఈవో డి.వెంకటేశ్వర్లుకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. లీజు జీవోను రద్దు చేయాలని, సత్రం భూమిలో ఏర్పాటుచేసిన క్రషర్ పాయింట్ లీజును కూడా రద్దు చేయాలని, అక్రమణలు మొత్తం తొలిగించాలని, జ్యూడిషియల్ విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని, అధికారికంగా తూర్పుసత్రం ఆస్తుల పరిరక్షణకమిటీ ఏర్పాటు చేయాలని, అన్యాక్రాంతానికి సహకరిస్తున్న ఈవోను వెంటనే సస్పెండ్ చేసి అతనిపై శాఖాపరమైన విచారణ జరిపి శిక్షించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ కమిషనర్, కలెక్టర్, జిల్లా దేవదాయశాఖాధికారి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. కాగా ఈ విషయమై ఈవో డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సత్రంభూమిలో 78సెంట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు 11 సంవత్సరాలకు లీజుకివ్వటం జరిగిందన్నారు. ప్రతినెల రూ.46వేల అద్దెకు ఇచ్చారన్నారు. ప్రతిమూడు సంవత్సరాలకు 30శాతం పెంపుదలతో లీజుకు ఇస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల కాపు సేవాసంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, నాయకులు లక్కాకుల వెంకటేశ్వరరావు, మారిశెట్టి రాఘవరావు, విన్నకోట సత్యప్రసాద్, పి.సుబ్బారావు, మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, జనసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి, జి.గిరిజారాణి, తూర్పుసత్రం భూముల పరిరక్షణకమిటీ సభ్యులు పి.అనీల్‌కుమార్, కె.లక్ష్మీనారాయణ, వై.రాజారమేష్, భాస్కరరావు, రామాంజనేయులు, కె.సురేష్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

భావదేవుని నగరోత్సవం


శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత క్షీరభావన్నారాయణస్వామి నగరోత్సవం చేస్తున్న పండితులు

బాపట్ల, మే 20: శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు శేషవాహనంపై నగరోత్సవం చేశారు. ఈ సందర్భంగా బాలికలు కోలాట ప్రదర్శనలతో ఉత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భక్తజనం పెద్దఎత్తున హాజరై ఉత్సవాన్ని వీక్షించారు.

శేషవాహనంపై కొలువుతీరిన భావదేవుడు

బాపట్ల, మే 20: పట్టణంలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి 1431వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారు శేషవాహనంపై కొలువుతీరారు. అర్చకస్వాములు శ్రీనివాసుల విఖనసమూర్తి, నల్లూరి విజయసారధి, నల్లూరి పాంచజన్యం, బృందావనం గోపిచంద్‌లు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తజనం స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్వామివారికి శేషవాహనంపై నగరోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు దేశిరాజు వెంకటరమణబాబు, ఈవో డి.వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి


ట్రాక్టర్‌లపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

పిట్టలవానిపాలెం, మే 20: పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని దేగలవారిపాలెంలో అనుమతి లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయని మండల ప్రజలు తెలిపారు. గ్రామంలో ట్రాక్టర్ల సాయంతో ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో కోడ్‌ను ఉల్లంఘించి ఇసుకాసురులు యథేచ్ఛగా కొనసాగిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని మండల ప్రజానీకం ఆరోపిస్తోంది. ఈ విషయమై సంబంధిత అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకొని ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశయాన్ని నీరుగార్చారు

● నిధుల మళ్ళింపుతో మూతపడ్డ డంపింగ్ యార్డులు

● గ్రామ శివారుల్లో గుట్టలుగా పడి ఉన్న చెత్తాచెదారం


వేమూరులో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు


చదలవాడలో మూతపడ్డ డంపింగ్ యార్డు

వేమూరు, మే 20: గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పాలన్న ఆశయంతో 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డులు ఏర్పాటుచేయాలని సంకల్పించింది. 2018లోగా మైనర్ పంచాయతీల్లో తప్పనిసరిగా డంపింగ్ యార్డు ఏర్పాటుచేయాలని ప్రత్యేక జీవోను జారీచేసింది. దాని ఆధారంగా మేజర్ గ్రామాల్లో రూ.15నుండి రూ.20లక్షల వ్యయంతో మైనర్ గ్రామాల్లో రూ.8నుండి రూ.10లక్షల వ్యయంతో ఈ డంపింగ్ యార్డులు ఏర్పాటుచేశారు. గ్రామాల్లో తడిచెత్త, పొడిచెత్త విడగొట్టి వాటిని డంపింగ్ యార్డులలో ఉంచి తడి చెత్త ద్వారా ఎరువును తయారు చేయడం పొడి చెత్తను అమ్మడం వీటి ద్వారా ప్రతి గ్రామ పంచాయతీకి ఆర్థికపరంగా సంపదను పెంచారు. గ్రీన్ అంబాసిడర్స్ పేరుతో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేశారు. వారికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే నిధుల నుండి నెలకు రూ.6వేల చొప్పున ప్రతి నెల వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. ఈ ప్రక్రియను వేమూరు నియోజకవర్గంలో ఉన్న 89 గ్రామాలకు గాను 79గ్రామాల్లో అమల్లోకి తెచ్చారు. జగన్ ప్రభుత్వం వచ్చాక గ్రీన్ అంబాసిడర్ల పేరును క్లాప్ మిత్రలుగా మార్చారు. అయితే నిర్వహణ విషయంలో సరైన శ్రద్ధ చూపకపోగా సిబ్బందికి జీతాలు నిలిపివేశారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సొమ్మును దారి మళ్ళించడం వల్ల వారికి జీతాలు ఆగిపోయాయి. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆర్థికపరంగా భారాన్ని మోపలేకపోతున్నామనే నెపంతో డంపింగ్ యార్డులపై దృష్టి పెట్టకుండా వదిలేశారు. పనిచేసే సిబ్బంది కూడా జీతాలు రావడం లేదని మానివేశారు. దీంతో ఈ పథకం పూర్తిగా నీరుగారిపోయింది. చివరికి గ్రామాల్లో పోగేసిన చెత్తాచెదారం ఆయా గ్రామాల శివారులలో గుట్టలుగా పడి ఉండి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెత్తాచెదారం గుట్టలు పెరిగిపోతున్నప్పుడల్లా వాటికి నిప్పు పెడుతున్నారు. ఈ గుట్టలు ఎక్కువగా ప్రధాన రోడ్డు మార్గాల పక్కనే ఉన్నాయి. వాటికి నిప్పు పెట్టినప్పుడు ప్రబలుతున్న పొగ వల్ల రోడ్డు మార్గాలు కనపడక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మూతపడ్డ డంపింగ్ యార్డులలో పిచ్చిమొక్కలు, పుట్టలు పెరగడంతో పాటు వాటిలో విష జంతువులు కూడా సంచరిస్తున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో ప్రారంభించిన ఈ ఆశయం పూర్తిగా నీరుగారిపోయింది.


పద్మావతి సెంటర్‌లో వర్షానికి జలమయమైన రహదారి


మున్సిపాల్టీ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

రేపల్లెలో భారీ వర్షం

● ఉదయం నుంచి కుండపోత

● రహదారులన్నీ జలమయం

● ప్రయాణికుల ఇక్కట్లు

రేపల్లె, మే 20: తీరంలో ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. గత వారం రోజులుగా తీరంలో వర్షాలు పడుతున్నాయి. సోమవారం ఉదయం రేపల్లె నియోజకవర్గంలో ఉదయం నుంచి ఉరుములు, మెరుపులతో కూడినవర్షం భారీవర్షం పడటంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. పట్టణంలోని బస్టాండ్‌రోడ్డు, పద్మాటాకీస్‌రోడ్డు, బసవేశ్వర థియేటర్ రోడ్డు పాత స్టేట్‌బ్యాంక్‌రోడ్డులో వర్షపు నీరు మోకాలు లోతు నిలబడటంతో ప్రయాణికుల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పురపాలక సంఘం అధికారులు డ్రెయిన్‌లో పూడిక తియ్యకపోవటంతో చిన్నపాటి వర్షానికే రహదారులన్నీ జలమయమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు మాత్రం వాటిమీద దృష్టి సారించిన దాఖలాలు లేవు. వర్షాకాలం సమీపిస్తుండటంతో మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయిన్‌లలో పూడిక తియ్యాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

వైభవంగా మహాశాంతి పూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం


మహాశాంతి పూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

బాపట్ల, మే 20: పట్టణంలోని శ్రీభావపురి శ్రీనివాస శ్రీవిఖనస ఆశ్రమంలో లోకకల్యాణార్థం సంకల్పించిన శ్రీలక్ష్మీ నరసింహ సుదర్శన మహాయాగాలు, శ్రీనివాస కల్యాణమహోత్సవాలు సంకల్పించి నేటికి 14 సుదర్శన యాగాలు, 14 శ్రీనివాస కల్యాణాలు పూర్తి అయిన సందర్భంగా సోమవారం 108మంది దంపతులతో 108 కలశాలతో మహాశాంతిపూర్వక అష్టోత్తర శతకలశాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల పరిసర ప్రాంతాలు నుంచి భక్తజనం పెద్దసంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమానికి ఆశ్రమ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్. కృష్ణమాచార్యులు, ఉమారెడ్డి వీరేంద్రకుమార్‌లు సహకారం అందించారు. కార్యక్రమంలో రాజు, మురళీ, రాజశేఖర్, స్వర్ణ రవి, ఆంజనేయులు, వీరరాఘవస్వామి, విజయసారధి తదితరులు భక్తులు వసతులు కల్పించారు.

రేపటి నుంచి వార్షిక హనుమజ్జయంతి ఉత్సవాలు


శ్రీవీరాంజనేయస్వామి మూలవిరాట్

వేమూరు, మే 20: మండలంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన జంపని గ్రామంలోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం నుంచి శ్రీహనుమజ్జయంతి వార్షిక ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు అర్చకులు శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం పండిత దీవి లక్ష్మీనరసింహాచార్యుల పర్యవేక్షణలో ఏకాదశి దీక్షతో నిర్వహించే ఉత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం స్వామివారికి గంగ సింధూర లేపన పూజా కార్యక్రమం జరుగుతుందన్నారు. జూన్ 1న హనుమజ్జయంతి పర్వదినం రోజువరకు ప్రతి రోజు ఉదయం సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకం సింధూరార్చన, చందనాభిషేకం జరుగుతుంది. సాయంత్రం పుష్ప పత్రపూజ నిర్వహించి సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ భజన అనంతరం పల్లకి ఉత్సవం నిర్వహిస్తామన్నారు. ప్రతిరోజు ఆధ్యాత్మిక ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 31వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకర్త వైఖానస ఆగమ పండితులు శ్రీమాన్ వికనాచార్య స్వామిచే సుందరకాండలో హనుమంతుని పాత్ర అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. రెండో తేదీ సాయంత్రం గ్రామంలో రథోత్సవం జరుగుతుందని వివరించారు.

అపూర్వ కలయిక


గూడవల్లి మునిస్వామి నాయుడు స్మారక ఉన్నత పాఠశాలలో కలుసుకున్న విద్యార్థులు

చెరుకుపల్లి, మే 20: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనటం ఎంతో ఆనందంగా ఉందని గూడవల్లిలోని మునిస్వామినాయుడు స్మారక ఉన్నత పాఠశాలలో 1983-84 పదవ తరగతి విద్యార్థులు అన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఈ సమ్మేళనంలో 90మంది విద్యార్థులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు హైదరాబాద్, మద్రాస్, బెంగుళూరు, విశాఖపట్నంల నుంచి గ్రామానికి చేరుకుని చిన్ననాటి స్మృతులను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు బి.వెంకట్రావు, ఆర్.వెంకటేశ్వరరావు, ఆచారి, డి.లలితాదేవి, మురళి, డి.వెంకటేశ్వరరావు, ప్రసాద్, స్కూల్ సెక్రటరీ గంటా శివప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ, కె.ముకుందామోహన్, కె.నరేంద్రబాబు, ఎ.మధుసూదన్‌రావు, కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అక్కడ ప్రమాదం జరిగితే అంతే సంగతులు..!

- తరచూ ఘటనలు
- ప్రాణాలతో బయటపడ్డ వారు తక్కువ మందే

అద్దంకి, మే 20 : నామ్ రోడ్డులో పలు చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలలో ప్రమాదాలు జరిగితే ప్రాణాలు గాలిలో కలిసినట్లే అనే భావన వాహనచోదకులలో నెలకొంది. ప్రధానంగా అద్దంకి మండలం చక్రాయపాలెం - శాంతినగర్ మధ్య ప్రమాదకర మలుపు ఉంది. భవనాసి చెరువు నిర్మాణం జరగకముందు (సుమారు 1916కి ముందు) నర్సారావుపేట రోడ్డు (ప్రస్తుతం నామ్ రోడ్డు) అద్దంకి నుంచి శింగరకొండ సమీపంలో గుండా భవనాసి చెరువు మధ్యలో గుండా ఉండేది. భవనాసి చెరువు నిర్మాణంతో గతంలో ఉన్న రోడ్డు పూర్తిగా ముంపునకు గురై చెరువు మధ్యలో గుండా ఏర్పడింది. దీంతో కొండచుట్టూ తిప్పి గోపాలపురం మీదుగా భవనాసి కట్ట కిందగా చక్రాయపాలెం మీదుగా శ్మశానం వద్ద పాత రోడ్డులో కలిసే విధంగా ఏర్పాటు చేశారు. అనంతరం నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో కూడా కొంత మేర అలైన్‌మెంట్ మార్పు చేసి అభివృద్ధి చేశారు. దీంతో చక్రాయపాలెం శ్మశానం సమీపంలో ఉన్న మలుపు మాత్రం అదే విధంగా ఉంచి రోడ్డు నిర్మాణం చేశారు. నామ్ రోడ్డు నిర్మాణం చేయక ముందు నుంచే చక్రాయపాలెం సమీపంలోని మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయి. ఈ క్రమంలో దశాబ్దన్నర కిందట జరిగిన ఆటో ప్రమాదంలో గోవాడకు చెందిన 8 మంది మృతి చెందారు. అనంతరం మరోసారి జరిగిన ప్రమాదంలో అద్దంకి పట్టణానికి చెందిన 4గురు మృత్యుఒడికి చేరారు. ఇలా తరచూ ప్రమాదాలు జరగడం వాహనచోదకులు మృతి చెందడం జరుగుతూనే ఉంది. దీనికి ప్రధాన కారణం మలుపు ప్రమాదకరంగా ఉండడంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు కాక రోడ్డు మార్జిన్‌లో గుండా పొలాలకు దూసుకు పోయి ప్రమాదాలకు గురవుతున్నాయి. నామ్ రోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు ఇతర ప్రాంతాలకు చెందిన కొత్తవారు ఉండడంతో ప్రమాదకర మలుపును గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. దీనికి తోడు ప్రమాదకర మలుపునకు ముందు వాహనచోదకులు గుర్తించే విధంగా హెచ్చరిక బోర్డులు నామమాత్రంగా ఉండడంతో గుర్తించలేకపోతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదం జరిగితే వాహనచోదకులతో పాటు అందులో ఉన్న ప్రయాణికులు ప్రాణాలతో బయటపడడం కష్టమేనన్న అభిప్రాయం నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకర మలుపును ముందే వాహనచోదకులు గుర్తించే విధంగా హెచ్చరిక బోర్డులు ఎక్కువగా ఏర్పాటు చేయాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.



నామ్ రోడ్డులో చక్రాయపాలెం వద్ద మలుపులో బోల్తా పడిన కారు (ఫైల్)

శ్రీ భీమలింగేశ్వరస్వామి వార్షికోత్సవాలు

23 వరకూ ప్రత్యేక పూజలు

పంగులూరు, మే 20 : మండల కేంద్రమైన పంగులూరులో గల ప్రసిద్ధ శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 వరకు జరుగనున్నాయి. ఈ వేడుకలు 20వ తేదీ సాయంత్రం నుంచి ప్రారంభంకాగా, వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలలో భాగంగా ఆలయంలోని దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. సోమవారం సాయంత్రం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ స్థాపన, మృత్సంగ్రహణ, అంకురారోపణ, వాస్తు పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. 21 మంగళవారం ఉదయం 7 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటలకు మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, సాయంత్రం 6 గంటల నుండి ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, రాయబారం, స్వామివారి దివ్య కల్యాణోత్సవం జరుగనున్నాయి.



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

22న పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం

శ్రీ భీమలింగేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవం సందర్భంగా 22వ తేదీ పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా విద్యుత్ ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 22వ తేదీన ఉదయం 6 గంటలకు నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం, 9 గంటల నుంచి శ్రీ అవధూతేంద్ర భక్తమండలి వారిచే ఏకాహ కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు బలిహరణ కార్యక్రమాలు జరుగనున్నాయి. అనంతరం శ్రీదాత భారతీయ జానపద కళాక్షేత్రం అద్దంకి వారిచే కోలాట ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 23వ తేదీ ఉదయం 7 గంటల నుంచి బలిహరణ, వసంత సేవ త్రిశూల స్నానం, పూర్ణాహుతి కార్యక్రమం జరుగనుండగా సాయంత్రం 7 గంటలకు ధ్వజారోహణ, మౌనబలి, ఏకాంత సేవతో వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమాలను బ్రహ్మశ్రీ శైవాగమ వేద పండితులు పేటేటి ఉదయభాస్కరశర్మ నిర్వహించనున్నట్లు తెలిపారు.

23న అన్నదానం

వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 23వ తేదీ 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో గ్రామస్థుల సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

28న నాంచారమ్మ తిరునాళ్ల

పర్చూరు, మే 20 : పర్చూరు గ్రామదేవత శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల ఈనెల 28న జరుగుతుందని ఆలయ వంశపారంపర్య అర్చకులు సోమవారం తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున శిడిమహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు

నేడు పూనూరులో స్వామివార్ల కల్యాణోత్సవం

యద్దనపూడి, (మార్టూరు) మే 20 : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలోని కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి త్రిపురసుందరీ సమేత త్రిపురాంతక స్వామి, భద్రకాళీ సమేత వీరభద్రస్వామిల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ బీ ఆంజనేయప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి అమ్మవారు అయ్యవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం స్వామి వారి రథోత్సవం, గురువారం వసంతోత్సవ పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. .

కౌంటింగ్ రోజు జాగ్రత్తలు పాటించండి



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న రూరల్ సీఐ, ఎస్ఐలు

చీరాలటౌన్, మే 20 : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ సమయంలో ఎక్కడా ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా జాగ్రత్తలు పాటించాలని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేటపాలెం, రామాపురం ప్రాంతాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ హింసాత్మక ప్రదేశాలను ఇప్పటికే గుర్తించినట్లు తెలిపారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు సురేష్, శివకుమార్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన బల్లికురవ ఎడ్ల జత

సీఎస్‌పురం(పామూరు), మే 20: సీఎస్‌పురం మండలం రామా పురం గ్రామంలో శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థాన తిరునాళ్ల సం దర్భంగా ఐదు జిల్లాల స్థాయిలో సోమవారం నిర్వహించిన ఎడ్ల బండ లాగుడు పోటీల్లో బల్లికురవకు చెందిన ఎడ్ల జత సత్తా చాటాయి. బల్లికురవ మండలం పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్ల జత 1589 అడుగులు లాగి ప్రథమ బహుమతి రూ. 50 వేలు నగదును కైవసం చేసుకున్నాయి

గుండ్లకమ్మలో ఇసుక తవ్వకాలపై పరిశీలన

అద్దంకి, మే 20 : ఇసుక అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ సోమవారం పరిశీలించారు. అద్దంకి పట్టణం సమీపంలో గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి ఇరువైపులా జరిగిన ఇసుక తవ్వకాలను, మణికేశ్వరం వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధిలో జరిగిన ఇసుక తవ్వకాలను జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి, తహసీల్దార్ మహబూబ్ సుభాని తదితరులు ఉన్నారు.



ఇసుక అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జేసీ శ్రీధర్

ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు

మేదరమెట్ల, మే 20 : ఇసుకను అక్రమంగా తవ్వడం, తరలించడంపై కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసులను కలెక్టర్ రంజిత్‌బాషా సూచించారు. సోమవారం అనమనమూరు వద్ద గుండ్లకమ్మ రిజర్వాయర్‌ను ఎస్పీ వకుల్ జిందాల్, మైనింగ్ ఏడీ రాజేష్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో డ్రెడ్జింగ్ చేసి నిల్వ చేసిన ఇసుక కుప్పలను ఆయన పరిశీలించారు. రిజర్వాయర్‌లో ఎక్కడెక్కడ తవ్వకాలు జరిగాయని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజర్వాయర్ ముంపులో రోడ్డు నిర్మాణం చేయడంతో పాటు నిబంధనలు మేరకు ఇసుక తవ్వకాలు జరపలేదని విషయాన్ని ఆయన గుర్తించారు. తమ్మవరం వద్ద ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రిజర్వాయర్ నుంచి నీరు అందించే కాలువను పూడ్చి రోడ్డు నిర్మించడంపై వెంటనే నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గుండ్లకమ్మ నది పరీవాహక ప్రాంతంలో రీచ్ లేని చోట ఎక్కడైన ఇసుక అక్రమ తవ్వకాలు జరపకుండా పోలీసులతో కలిపి టీమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అద్దంకి, కొరిశపాడు తహసీల్దార్‌లను ఆ యన ఆదేశించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో లోపలకు వెళ్లి డ్రెడ్జింగ్ చేసిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఆర్‌డీవో సూర్యనారాయణరెడ్డి, బాపట్ల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, అద్దంకి రూరల్ సీఐ శివరామకృష్ణారెడ్డి, రేణంగివరం ఎస్ఐ తిరుపతిరావు, కొరిశపాడు తహసీల్దార్ సుశీల, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో ఇసుక తవ్వకాలు జరిపిన ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ జిందాల్

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

చీరాల పరిధిలోని లాడ్జిలు, కల్యాణ మండపాలు, రిసార్ట్స్‌లలో పోలీసుల ముమ్మర తనిఖీలు

చీరాలటౌన్, మే 20 : ఎన్నికల కౌంటింగ్ సమయం ఆసన్నమవుతుండడంతో చీరాల పోలీసులు అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల పట్టణం, సముద్రతీర ప్రాంతాల్లోని లాడ్జిలు, రిసార్ట్స్, కల్యాణ మండపాలలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ప్రాంతాల్లోని అనుమానితుల వివరాలు సేకరించారు. అంతేకాకుండా రికార్డులను నిశితంగా పరిశీలించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ జరిగేందుకు అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈక్రమంలోనే తనిఖీ సమయంలో వ్యక్తుల వివరాలతో పాటు గతంలో ఏదైనా కేసుల్లో వీరి ప్రాధాన్యతపై కూడా ఆరా తీస్తున్నట్లు పేర్కొన్నారు. ఈవిధమైన తనిఖీలు నిత్యం ఉంటాయని చెప్పారు. కావున నేర నియంత్రణకు ప్రయత్నిస్తే చిక్కుల్లో పడతారని హెచ్చరించారు. అనుమానితుల్ని గుర్తిస్తే 100, 112 నంబర్‌లకు సమాచారం అందించాలన్నారు. తనిఖీలలో వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు, టూటౌన్ సీఐ సోమశేఖర్, రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఆయా స్టేషన్‌ల పరిధిలోని ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



లాడ్జిలో రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ శేషగిరిరావు

పెదనక్కలపాలెంలో డీఎస్పీ విచారణ

ఇంకొల్లు, మే 20 : మండలంలోని పెదనక్కలపాలెంలో ఎన్నికల రోజున జరిగిన ఘటనపై ఇరువర్గాలు ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సోమవారం చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ పెదనక్కలపాలెం గ్రామంలో విచారణ చేసారు. ఇరువర్గాలతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఇంకొల్లు ఎస్ఐ మల్లికార్జునరావు ఉన్నారు.



బైకును అందజేస్తున్న టీడీపీ నాయకులు

దివ్యాంగుడికి బైకును అందజేసిన గొట్టిపాటి

బల్లికురవ, మే 20 : మండలంలోని వల్లాపల్లి ముస్లింకాలనీకి చెందిన పూర్తి వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగుడు షేక్ జాన్‌బాషాకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మూడుచక్రాల బైకును సోమవారం గ్రామ టీడీపీ నేతల ద్వారా అందజేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలో వల్లాపల్లి ముస్లిం కాలనీకి వచ్చిన ఎమ్మెల్యే రవికుమార్‌కు దివ్యాంగుడు జాన్‌బాషా కలిశారు. అయనను చూసిన ఎమ్మెల్యే బైకు ఇస్తానని, ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో, ఎన్నికలు ముగిశాక ఇస్తానని ఇచ్చిన హామీ మేరకు టీడీపీ గ్రామ నేతల ద్వారా బైకును జాన్‌బాషాకు అందజేశారు. టీడీపీ నేత చింతల అమరనాథ్ బైకుకు ఇన్సూరెన్స్, ట్యాక్స్‌ను కట్టి కొంత సహకారం అందజేశారు. కార్యక్రమంలో నేతలు పరుసు ప్రసాద్, పత్తిపాటి వెంకట్రావు, షేక్ అల్లాఉద్దీన్, మందా వీరాంజనేయులు పాల్గొన్నారు.

మత్స్యకారుడు మృతి

రామాపురం(చీరాలటౌన్), మే 20 : ద్విచక్ర వాహనం అదుపు తప్పి మత్స్యకారుడు దుర్మరణం చెందాడు. ఈసంఘటన సోమవారం రాత్రి వాడరేవు - రామాపురం రోడ్డులో చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం ఊటుకూరి సబ్బయ్య పాలెంకు చెందిన ఊటుకూరి బాలాజీ (55) మత్స్యకారుడు. ఇతను ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతూ వాహనం అదుపుతప్పి బోల్తా పడి మృతి చెందారు. ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బంగారు నగల పర్సు చోరీ

ఓటు వేసేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా ఘటన

అద్దంకి, మే 20 : ఆర్టీసీ బస్టాండ్‌లో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికురాలి వద్ద బంగారం వస్తువులు ఉన్న పర్సు చోరీకి గురైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పంగులూరు మండలం అలవలపాడుకు చెందిన చల్లా భాను ఓటు వేసేందుకు వచ్చి సోమవారం హైదరాబాద్ వెళ్లేందుకు అద్దంకి బస్టాండ్‌కు వచ్చారు. ఉదయం 10-30 గంటలకు హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కిన తరువాత సంచి పరిశీలించగా బంగారు నగలు ఉన్న పర్సు కనిపించలేదు. సుమారు రూ.1.40 లక్షల విలువైన నగలు చోరీకి గురైనట్లు ప్రయాణికురాలు భాను పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరా చోరీపై కేసు

పుల్లాయిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పుల్లాయిపాలెం ఓ బూత్‌లో సీసీ కెమెరా చోరీకి గురైంది. దీంతో సచివాలయ మహిళ పోలీస్ ధనలక్ష్మి సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకోగలరు

- ప్రకాశం పంతులు మునిమనవరాలు
- టంగుటూరికి ఘనంగా నివాళి

అద్దంకిటౌన్, మే 20 : విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకుని ఇష్టమైన రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనవరాలు సుభాషిణి అన్నారు. సోమవారం అద్దంకిలోని ప్రకాశం మిత్రమండలి ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి కార్యక్రమం స్థానిక శ్రీనివాస కల్యాణ మండపంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టంగుటూరి ప్రకాశం పంతులు మునిమనుమరాలు సుభాషిణి హాజరయ్యారు. ముందుగా బంగ్లారోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకావం పంతులు సేవలను పలువురు సభ్యులు కొనియడారు. అనంతరం శ్రీనివాస కల్యాణ మండపంలో అద్దంకి మండలంలో పదివ తరగతిలో 550కి పైగా మార్కులు వచ్చిన విద్యార్థినీవిద్యార్థులకు నగదు బహుమతితోపాటు సర్టిఫికెట్‌లను అందజేశారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు. ఊటుకూరి కృష్ణసుభాన్, రావూరి రంగయ్య సౌజన్యంతో 31 మంది విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. అ లాగే మిగిలనవారికి బహుమతులను, వివిధ రకాల పుస్తకాలను అందజేశారు. ఈ క్రమంలో ఆత్మీయ అతిథిగా ఉటుకూరి ఉమ అన్నపూర్ణ, వీరవల్లి రుద్రయ్య, దివాకర్ దత్తు, జ్యోతిష్మతి, మహమ్మద్ రఫీ, ఇలపావులూరి శేషతల్పసాయి, కోశాధికారి ఉటూకూరి రామకోటేశ్వరావు, తల్లిదండ్రులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రకాశం మిత్రమండలి సభ్యులు



తరగతులను నిర్వహిస్తున్న గ్రంథపాలకుడు

వేసవి శిక్షణతో విజ్ఞానం

బల్లికురవ. మే 20 : వేసవిలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను సద్వినియెగం చేసుకోవాలని బల్లికురవ శాఖ గ్రంథ పాలకుడు అడ్డగడ్డ రమేష్‌బాబు కోరారు. సోమవారం బల్లికురవ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను యేపన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు పాఠశాలలు తెరిచే వరకు విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించేలా ప్రతి రోజూ కథల పుస్తకాలు చదివించడం, బొమ్మలు వేయించటం చేస్తున్నామని, అలాగే క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

లూజు విక్రయాలు చేయొద్దు

పెట్రోల్ బంక్ యజమానులకు నోటీసులు

మార్టూరు, మే 20 : వాహనదారులకు ఖాళీ క్యానుల్లో, ఖాళీ బాటిల్లో లూజుగా పెట్రోల్, డీజిల్‌ను పోయవద్దని మండలంలోని పెట్రోలు బంకు యజమానులకు సోమవారం నోటీసులను జారీ చేసినట్లు మార్టూరు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌పీ రాజశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషన్, ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు లూజు విక్రయాలు చేయొద్దని కేవలం వాహనాల్లో మాత్రమే వాటిని పోయాలని, తదుపరి ఉత్తర్యులు వచ్చే వరకు పెట్రోలు బంకుల యజమానులు సహకరించాలని రాజశేఖర్ రెడ్డి కోరారు.

వృద్ధురాలిపై దాడి

వ్యక్తిగత వివాదాలే కారణం

చీరాలటౌన్, మే 20 : వ్యక్తిగత వివాదాలతో వృద్ధురాలిపై పలువురు తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. ఈ ఘటన సోమవారం ఇంకొల్లు పరిధిలోని ఇందిర కాలనీలో చోటుచేసుకుంది. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాల ప్రకారం కాలనీకు చెందిన 62 సంవత్సరాల పాలపర్తి రాణి ప్రమీళకు అదే ప్రాంతానికి చెందిన జేమ్స్, చంద్, మోజెస్ ఇరుగు పొరుగులు కావడంతో గతకొంత కాలంగా వ్యక్తిగత వివాదాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో ఉదయం సుమారు ఏడుగంటల సమయంలో ఇంట్లోకి చొరబడి తీవ్రంగా దాడిచేసి గా యపరిచారు. ఈ నేపథ్యంలో వృద్ధురాలి కుడిచేయి విరిగిపోయింది. దీంతో కు టుంబ సభ్యులు ఆమెను 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

మారిన ఎఫ్‌ఐఆర్ కాపీ

- హాస్పిటల్‌లో బాధితురాలి ఆవేదన
- వాస్తవం తెలుసుకుని తిరిగి వెళ్లిన వైనం

చీరాలటౌన్, మే 20 : దాడిలో గాయపడి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీ మారిందని వివాహిత చీరాల ఏరియా హాస్పిటల్ వద్ద కొద్దిసేపు ఆవేదన చెందారు. వివరాల్లోకి వెళితే కొత్తపట్నంకు చెందిన సలిశం శైలజకు ఇంకొల్లు మండలం భీమవరానికి చెందిన ఆంజనేయులుతో సుమారు 13 ఏళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. వీరికి పాప, బాబు ఉన్నారు. భర్త అమాయకుడు కావడంతో ఈమె కుట్టు మిషన్ కుడుతోంది. అయితే అత్త పద్మావతి, మామ సూర్యనారాయణ పదేపదే గొడవలు పెట్టుకుంటున్నారు. అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. ఈ క్రమంలో గత మంగళవారం శైలజపై కుట్టు మిషన్ పరికరంతో తీవ్రంగా దాడిచేసి గాయపరిచారు. అప్పుడు శైలజ తలకు తీవ్ర రక్త గాయమైంది. దీంతో స్థానికులు ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా వైద్య పరీక్షలు చేసిన వైద్యుల ఆమెకు రక్తం తక్కువగా ఉందని, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌కు తరలించి నాలుగు రోజులు చికత్స అందించారు. ఇదిలావుండగా చీరాల ఏరియా హాస్పిటల్‌లో చేరిన సమయంలో అక్కడి అవుట్‌పోస్ట్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. కానీ ఒంగోలు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఇంకొల్లు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కాపీ మారిందని, నీపైనే కేసు నమోదు అయినట్లు స్థానికులు చెప్పారు. దీంతో అవగాహన లేని శైలజ చీరాల ఏరియా హాస్పిటల్ వద్దకు బంధువులతో చేరి రోదించింది. కానీ అవుట్‌పోస్ట్ పోలీసులు ఇంకొల్లు పోలీసుల ద్వారా సమాచారం తెలుసుకోగా శైలజ ఇచ్చిన ఫిర్యాదు మేరకే అత్త, మామలపై కేసు నమోదైంది. దీంతో వాస్తవం తెలుసుకున్న అమె అక్కడి నుంచి విరమించింది.



రోదిస్తున్న శైలజ

గ్రానైట్ ముడిరాయి లారీల పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న గ్రానైట్ ముడిరాయి లారీలు

బల్లికురవ. మే 20 : పర్మిట్ లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు గ్రానైట్ ముడిరాయి లారీలను సోమవారం గుంటూరు విజిలెన్స్ సీఐ శ్రీహరిరావు పట్టుకొన్నారు. బల్లికురవ గ్రానైట్ క్వారీల నుంచి మార్టూరు గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్న ముడిరాయి లారీలను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వెంటనే లారీలపై కేసు నమోదు చేసి వెంటనే బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు.

నాడు-నేడు పెండింగ్ పనులపై సమీక్ష

మార్టూరు, మే 20 : నాడు - నేడు పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలపై సోమవారం నాలుగు మండలాల సీఆర్‌పీలతో మండల విద్యాశాఖ కార్యాలయంలో జిల్లా ప్రతినిధి ఏఎల్ఎస్‌వో సాగర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఏర్పాటు, ఇసుక కొరత, స్కూళ్లల్లో సివిల్ పనులు తదితర అంశాలపై ఆయన సీఆర్‌పీలతో చర్చించారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి తీసుకోవలసిన చర్యలపై సూచనలు ఇచ్చారు. సమావేశంలో మార్టూరు, బల్లికురవ, యద్దనపూడి, సంతమాగులూరు మండలాలకు చెందిన సీఆర్‌పీలు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు బాలుడు

కావూరివారిపాలెం(చీరాలటౌన్), మే 20 : ఆదివారం రాత్రి కిడ్నాప్ అయిన బాలుడు ఎట్టకేలకు సోమవారం మధ్యాహ్నం పోలీసుల చొరవతో తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళితే.. చీరాల మండల పరిధిలోని కావూరివారిపాలెం పంచాయతీ ఆంధ్రకేసరినగర్‌కు చెందిన మూకిరి నయోమి స్టూవర్టుపురానికి చెందిన వ్యాపారి వద్ద కొంత నగదు బాకీ తీసుకుంది. తిరిగి చెల్లించే క్రమంలో ఆలస్యం కావడంతో వ్యాపారి ఆమె మనవడు పాల్సన్‌ను మరో ఇద్దరి సహకారంతో కిడ్నాప్ చేశారు. అయితే విషయం తెలుసుకున్న ఈపూరుపాలెం పోలీసులు రంగంలోకి దిగారు. తమదైన శైలిలో వ్యాపారితో ఫోన్‌లో మాట్లాడగా సోమవారం మధ్యాహ్నానికి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. అలాగే బాకీ తీసుకున్న వారికి గట్టిగా మందలించారు.